ప్రజాశక్తి

ఆదివారం అనుబంధం

జులై 10, 2016

KSR02B128C



ENTERED



అమ్మే ఆధారం





కపిల్ దేవ్



సునీల్ గవాస్కర్



యువరాజ్

సలీల్ అంకోష్

సినీ పిచ్‌పై క్రికెటర్లు

బాలీవుడ్‌కి క్రికెట్‌కి కనెక్టివిటీ ఎక్కువనే చెప్పాలి. ఎందుకంటే రెండింటిలో కథా వస్తువు ఒకటే. అదేనండి వినోదం. భారత్‌లో క్రికెట్, సినిమా రెండూ అభిమానులకు జ్వరం పట్టిస్తాయి. ఇక ఆ రెండు కలిస్తే ఇకా ఫీవర్‌కు థర్మామీటర్ పేలిపోతుందేమో. క్రికెట్ కథాంశంగా నిర్మించిన 'లగాన్' ఏం చేసిందో చూసే ఉంటాం. కథాంశమే క్రికెట్ అయితే అలా ఉంటే మరి ప్రపంచ దిగ్గజం మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ జీవిత కథాంశంతో వస్తోన్న చిత్రం 'సచిన్ (ఎ బిలియన్ డ్రీమ్స్)' ఇంకేం చేస్తుందో. ఇందులో సచిన్‌తో పాటు కొడుకు అర్జున్ కూడా తెరపై కనిపించనున్నాడు. ఈ రెండు చిత్రాల గ్యాప్‌లో మరికొందరు క్రికెట్ స్టార్లు సినిమాల్లో పరుగులు తీశారు.. బౌన్సర్లు వేశారు. లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్ 'సావ్లీ ప్రేమాఛి' అనే మరాఠీ చిత్రంలోను, 1998లో నసీరుద్దీన్ షాతో కలసి 'మాలామాల్'లోను నటనను బౌండరీలు దాటించాడు. అజయ్ జడేజా 2003లో 'ఖేల్'లో నటనను క్యాచ్ చేసే యత్నం చేశాడు. యువరాజ్ బాలనటుడిగా పంజాబీ చిత్రాల్లో నటించి ప్రతిభను పెవిలియన్ బయటకు విసిరాడు. హర్యానా హరికేన్ కపిల్ దేవ్ 'ఇక్బాల్'లో కోచింగ్ ఇచ్చాడు. సంజయ్ దత్‌తో కలిసి వినోద్ కాంబ్లి 'అనర్థ్'లో స్టైక్ చేశాడు. సలీల్ అంకోష్ 'చురాలియా హై తుమ్‌నే' 'కురుక్షేత్ర'తో సినిమాపిచ్‌లోనాటుకు పోయాడు.

KSR02B128
ENTERED

జియా జాన్ 7

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నుంచి ఇప్పటి వరకూ ఏ క్రీడలోనైనా కాశ్మీర్ నుంచి జాతీయ జట్టులోకి ఎంపికైన వారి సంఖ్య ఐదు లోపే. ఈ ఒక్క ఉదాహరణ చాలు కాశ్మీర్‌లో క్రీడలకు లభించే ప్రాముఖ్యతను అర్థం చేసుకోవచ్చు. సామాజిక కట్టుబాట్లు,ఉగ్రవాదం, ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి.. ఇన్ని అవాంతరాలున్నా ఓ క్రీడా నక్షత్రం అక్కడ తళుక్కున మెరుస్తోంది. అది కూడా ఫుట్‌బాల్‌లో మూడు కీలక బాధ్యతలు పోషిస్తూ ఒక టీనేజ్ అమ్మాయి అంతర్జాతీయంగా అందరి దృష్టిని ఆకట్టుకుంటోంది. 'జియా జాన్ 7'గా కాశ్మీర్ ఫుట్‌బాల్ క్రీడాకారులకు ఆమె ప్రేరణనిస్తోంది.

నదియా నిఘాత్‌ది శ్రీనగర్‌లోని రామ్‌బాఘ్ ప్రాంతం. ఆమెకు పదేళ్లు నిండే సరికే ఫుట్‌బాల్ ఆటపై ఇష్టం ఏర్పడింది. 2007లో చుట్టుపక్కల అబ్బాయిలతో కలసి ఆడేది. టామ్‌బాయ్‌లా కనిపించే కూతురిని చూసి తండ్రి మురిసిపోయేవాడు. తల్లి మాత్రం నదియాను వారించేది. ఆడపిల్ల అలాంటి ఆటలు ఆడితే ఇంకేమన్నా ఉందా? ఇరుగు పొరుగు వాళ్లు నీ గురించి తప్పుగా అనుకుంటారంటూ నదియాను విసుక్కునేది. కానీ తండ్రి మాత్రం పూర్తి స్వేచ్ఛనిచ్చాడు. కూతురి మనసు అర్థం చేసుకున్న తల్లి కూడా ఆ తర్వాత స్వయంగా మైదానానికి తీసుకెళ్లి ఆడుకోనిచ్చేది. ఆమె ఫుట్‌బాల్‌లో ప్రవేశిస్తానంటేనే ఇరుగు–పొరుగువాళ్లు, బంధువులు, స్నేహితులు చాలా హేళన చేశారు. నదియా తల్లిదండ్రులు మాత్రం ఆమె ఆకాంక్షలకు ఊతానిచ్చారు. ఆమెకు ఫుట్‌బాల్ కిట్ కొనివ్వడమే కాక స్వయంగా తండ్రే మైదానానికి తీసుకెళ్లి ఆడించేవాడు. చిన్నతనం నుంచే ఫుట్‌బాల్‌కు పెద్ద ఫ్యాన్‌గా మారిపోయింది నదియా. టీవీలో ఇంగ్లండ్ ప్రీమియర్ లీగ్, యూరో, కోపా అమెరికా, ఫీఫా మ్యాచ్‌ల్ని వదిలిపెట్టకుండా చూసేది. పోర్చుగల్, అర్జెంటీనా టీమ్‌లకు పెద్ద అభిమాని అయిన నదియా ఆ మ్యాచ్‌ల్ని చూస్తూనే ఫుట్‌బాల్‌ను ఎలా నియంత్రించాలనే విషయంలో టెక్నిక్‌ను పట్టింది. టీవీకి అతుక్కుపోయి తన అభిమాన ఫుట్‌బాల్ దిగ్గజాలు లయోనల్ మెస్సీ కదలికల్ని, పరుగును, మెళకువల్ని, క్రిస్టియానో రోనాల్డో పాస్‌ల్ని, ఫ్రీ కిక్‌ల్ని సునిశితంగా పరిశీలించేది. ఆమె డ్రిబ్లింగ్ చేసే విధానం కూడా ప్రత్యర్థికి బంతిని లాక్కునే అవకాశమివ్వదు. కూతురిలోని ఈ అసాధారణ ప్రతిభను గమనించిన తల్లిదండ్రులు ఆమెకు స్థానిక అమర్‌సింగ్ అకాడెమీ ఫర్ ఫుట్‌బాల్‌లో

కోచింగ్ ఇప్పించారు. అక్కడ 47 మంది అబ్బాయిలుంటే నదియా ఒక్కర్తే అమ్మాయి. ఆమె వారితో ఏ మాత్రం బెరుకు లేకుండా పోటీ పడి ఆడటం చూసిన కోచ్ మహమ్మద్ అబ్దుల్లా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఆమె కెరీర్‌ను మలిచారు. కేవలం క్రీడాకారిణిగానే కాక ఫుట్‌బాల్‌పై పూర్తి అవగాహన కల్పించి కోచ్‌గా, రెఫరీగా ఆమె ఒకేసారి మూడు అడుగులు వేయడంలో అబ్దుల్లా కృషి చేశారు.

నదియాకు ఇప్పటివరకు 10 జాతీయ, రాష్ట్రీయ పురస్కారాలు దక్కాయి. కాశ్మీర్ ఫుట్‌బాల్ సమాఖ్యకు మోరల్, టెక్నికల్ సపోర్టర్‌గా నదియా బాధ్యతలు నిర్వహిస్తోంది. అలాగే 30 మంది అండర్–19 ఆటగాళ్లకు శిక్షణ ఇవ్వడంలో నదియా ప్రస్తుతం బిజీగా ఉంది. శ్రీనగర్‌లో ఆమెకు సొంతంగా ఒక ఫుట్‌బాల్ క్లబ్ కూడా ఉంది. ఆ ఫుట్‌బాల్ క్లబ్‌కు 'జెజె7' అని నదియా నామకరణం చేసింది. జేజే అంటే జియా జాన్ అని అర్థం. 7 ఆమె జెర్సీ నంబర్. నదియాకు బెస్ట్ రెఫరీ అవార్డు కూడా లభించింది. అబ్బాయిల పోటీలకు కూడా ఆమె రెఫరీగా వ్యవహరిస్తుంది. ఫీఫా వద్ద నుంచి డీ–లైసెన్స్ కూడా వచ్చింది. ఆమె క్వాలిఫైడ్ కోచ్. తన క్లబ్‌తో పాటు రామ్‌బాగ్ క్లబ్ క్రీడాకారులకు కూడా ఆమె కోచింగ్ ఇస్తుంది.

నదియా రెండు జాతీయ స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్లలో పాల్గొంది. 2007లో అంటే తన పదేళ్ల వయసులో ఫుట్‌బాల్‌లోకి ప్రవేశించిన నదియా ప్రస్తుతం కోచ్‌గా మారింది. నిజం చెప్పాలంటే ఆమె చెప్పడం, నేర్చుకోవడం ఒకేసారి చేస్తోంది. ఆ అనుభవం గొప్పగా ఉందట ఆమెకు. నదియా కొన్ని నెలల క్రితమే చన్నపోరలోని జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వ పాఠశాలలో 12వ తరగతి పూర్తి చేసుకుంది. ప్రస్తుతం ఆమె ఫిజికల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో ప్రవేశం కోసం ప్రయత్నిస్తోంది.సాధారణంగా ఆలోచిస్తే నదియా సాధించినదాంట్లో భారీ గొప్పతనం కనిపించకపోవచ్చు. కానీ కాశ్మీర్ వంటి రాష్ట్రంలో నదియా శ్రమ, అందుకున్న విజయం చాలా గొప్పది. నదియాను చూసి ఇప్పుడు కాశ్మీర్‌లో అనేక మంది ఫుట్‌బాల్ క్రీడపై ఆసక్తి పెంచుకుంటున్నారు. వీరిలో అబ్బాయిలు, అమ్మాయిలు కూడా ఉన్నారు. ఫుట్‌బాల్‌లో శిక్షణ కోసం ప్రాథమిక విషయాలతో రెండు ప్రత్యేక కోర్సులను నదియా స్వయంగా రూపొందించింది.

మహిళలు క్రీడలను కెరీర్‌గా ఎంచుకోవడంపై ప్రజల ఆలోచన విధానం మారాలని నదియా కోరుకుంటోంది. భారత్ తరపున ప్రపంచ స్థాయి టోర్నీల్లో పాల్గొనాలన్నదే ఆమె అభిలాష.

- విశ్వ ప్రసాద్

ఇండెక్స్

స్టార్...............3

కట్టప్ప మిస్సవడు

సందర్భం.............4

వందేళ్ళ మహిళా వర్సిటీ

కార్టూన్ పంచ్......... 5

వింతలోకం..................10

మాస్కోలో రీపర్

ప్రత్యేకం.............11

మార్పు తెచ్చారు

కొత్త పుస్తకాలు...............14

జనసామాన్యమే ఇతివృత్తం

అమ్మే ఆధారం

అట్టమీది కథ...6

నా కళ్లతో - 12

12 నెలలు దేశాలు సవాళ్లు

వివరం...................15

రగులుతోన్న దీవి

తెలుసా 16

కాల ప్రవాహంలో...

కథ...............18

జేబు

రుచి.....................21

ఫిష్ ఫింగర్స్'

బాల నేస్తాలు.............23

కాగితంతో బెలూన్

పద వికాసం.....

....24

రైతుకు హ్యాట్సాఫ్

26ఏళ్ల అమ్మాయి రాణా ఆయూబ్ ప్రాణాలు లెక్కచేయకుండా గుజరాత్‌లో ఎన్‌కౌంటర్లపై స్టింగ్ ఆపరేషన్లు చేసి సాక్ష్యాలను నిరూపించినా అదంతా కట్టుకథ అని తిరస్కరించడం పిరికిచర్య. పిల్లలకి ఎలిమెంటరీ స్థాయి నుంచే ఆటలపై స్కూళ్లు ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలన్న కవర్ స్టోరీ చాలా బాగుంది. కాని మన దేశంలో ఆట స్థలాలున్న బడులు అంతంత మాత్రం. అందునా ఎ.పి మరీ అధ్వాన్నం. గొరిల్లా కోకో కేవలం సైగల భాషతోనే ఎంతో చక్కగా సంభాషించడం, ఇంగ్లీషు మాటల్ని క్షణాల్లో గ్రహించడం మరీ అద్భుతం. సౌర శక్తితో చిన్న చిన్న సోలార్ పోల్స్, సోలార్ బ్లింకింగ్ లైట్స్‌ని పంటపొలాల్లో ఏర్పాటు చేసి రాత్రులు వాటి ద్వారా వికృత శబ్దాలు క్రియేట్ చేసి అడవి జంతువుల్ని బెదర కొడుతూ, క్రిమి కీటకాలనూ సంహరిస్తున్న రైతు రామచంద్రయ్య వినూత్న ప్రయత్నాలకి హ్యాట్సాప్.

టి. సత్యనారాయణ మూర్తి, విశాఖపట్నం

ఆకట్టుకున్న అట్టమీది కథ

పిల్లలకు విద్యతోపాటు ఆటస్థలాల ఆవశ్యకతను తెలియజేసిన ఆటలపాటల హరివిల్లు ఆకట్టుకుంది. అడవి జంతువుల



నుండి పంట పొలాలని కాచుకున్న రామచంద్రయ్య ఒక సామాన్య రైతు కాదు అతనో గొప్ప ఆవిష్కర్త. మితిమీరిన అభిమానంతో అభిమాన పాప్ సింగర్స్ ప్రాణం తీయడం హేయమైన చర్య.. ఆరుఖండాలు అరవై పెళ్లిళ్లు, స్ప్రింటర్ జాజిపూవమ్మ, ప్రయాణం కథ ఆకట్టుకున్నాయి. మారువేషంలో స్టింగ్ ఆపరేషన్ చేసిన రాణా అయూబ్ సాహసనారి. ఆమె మాటల్ని పట్టించుకోకుండా సంస్థ ఆమెను చిన్న చూపు చూడడం బాధాకరం.

కార్టూన్ పంచ్ , నవ్వుల్ పువ్వుల్ బాగున్నాయి.

- అన్వేషిత, అనంతపురం

కోకో మాట

మనిషి నేర్పించే మాటలు నేర్చుకున్న జంతువులున్నాయి. యజమాని చెప్పిన చిన్న చిన్న పనుల్ని చేసే పెంపుడు జంతువులూ ఉన్నాయి. అయితే మనుషుల మాటలు, చేష్టలేకాకుండా కొత్త భాషనీ కోకో అర్థం చేసుకోవడం నిజంగా అద్భుతం. పిల్లి పిల్లల్ని పెంచుతూ కోకో వాటికి పేర్లు పెట్టడం ఆశ్చర్యానికి గురిచేసింది. తల్లి ప్రేరణతో స్ప్రింటర్‌గా విజయాలు సాధిస్తున్న పూవమ్మకి అభినందనలు. పంటకు సోలార్ రక్షణ, చిట్టి ఇంటికి దారేది, ప్రయాణం కథ, విద్యార్థుల వికాసానికి ఆటస్థలాల ఆవశ్యకతను చెప్పిన ఆటలపాటల హరివిల్లు, ప్రపంచదేశాల్ని చుట్టబెడుతూ అక్కడి రీతిలో మళ్లీ మళ్లీ పెళ్లిచేసుకుంటున్న చీత, ఉడ్‌యార్డ్‌ల పరిచయం, పాప్ సంగీత ప్రపంచంలో హద్దులు దాటుతున్న అభిమానం, ప్రస్తుత రాజధానిలో భూములు కోల్పోయిన రైతుల అవస్థలు కళ్లకు కట్టినట్టు చూపిన 'రాజధాని' కథ ఆద్యంతం చదివించాయి.

-ఫాతిమా, విజయవాడ

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.

మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

కట్టప్ప మిస్సవ్వడు

సత్యరాజ్ కొడుక్కి కొండంత అండైై జాగ్రత్తగా కెరీర్‌ను తీర్చిదిద్దితే తండ్రికి తగ్గ కొడుకుగా శిబిరాజ్ నటనలో ప్రత్యేకతను చాటుకుంటున్నాడు. ఆరంభంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ప్రయోగాత్మక చిత్రాలనే ఎంచుకుంటూ.. సినిమా సినిమాకు ఎంత గ్యాప్ వచ్చినా పట్టించుకోకుండా విలక్షణ పాత్రలు చేస్తూ ఆకట్టుకుంటున్నాడు. హిట్టుఫ్లాప్ అనే మాటలతో సంబంధం లేకుండా కేరెక్టర్‌నే చాటుతున్నాడు. తెరపై కట్టప్ప (సత్యరాజ్) మిస్సవ్వడని ఆ పాత్రను భర్తీ చేస్తూ అభిమానులకు భరోసానిస్తున్నాడు.

1982 అక్టోబర్ 6న చెన్నైలో జన్మించిన శిబిరాజ్ కామర్స్‌లో డిగ్రీ చేశాక 2003 నుంచి నటుడిగా కెరీర్ ప్రారంభించాడు.

- ఎన్టీఆర్ హీరోగా నటించిన 'స్టూడెంట్ నం.1' చిత్రాన్ని తమిళంలో రీమేక్ చేశారు. అదే టైటిల్‌తో శిబిరాజ్ హీరోగా ఎంట్రీ ఇచ్చాడు. తెలుగులో విజయం సాధించినా తమిళంలో ప్రేక్షకులు ఆదరించలేదు.
- మొదట చిత్రం దర్శకత్వం వహించిన సెల్వ 'జోరే' చిత్రంలో శిబిరాజ్ హీరోగా మరోసారి చేశాడు. ఈ సారి మాత్రం తండ్రీ కొడుకులు సత్యరాజ్, శిబిరాజ్ కలిసి ఈ చిత్రంలో నటించారు. వీరివే లీడ్ రోల్స్. తండ్రీ కొడుకులుగానే నటించారు.
- 2005లో 'యజ్ఞం' చిత్రాన్ని తమిళంలో 'మన్నిన్ మెయినధన్' పేరుతో శిబిరాజ్ హీరోగా రీమేక్ చేశారు. తెలుగులో ప్రకాష్ రాజ్ పాత్రను తమిళంలో సత్యరాజ్ పోషించారు. ఈ సినిమాకు అనుకూలమైన రివ్యూలు రాలేదు.
- అదే ఏడాది ఇదే కాంబినేషన్‌లో 'వెట్రియివెల్ శక్తివేల్'లో నటించారు. ఇందులో కూడా సత్యరాజ్, శిబిరాజ్ తండ్రీకొడుకులే. ఖుష్బూ తల్లిగా నటించింది. ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించారు.
- 2006లో హాస్య భరితంగా తీసిన 'కోవై బ్రదర్స్'లో చేశాడు. నమిత హీరోయిన్. తెలుగులో 'పోకిరి బ్రదర్స్' పేరుతో విడుదలైంది.
- వరుసగా తండ్రితో కలసి నాలుగు చిత్రాల్లో నటించిన హీరోగా చెప్పవచ్చు. ఇన్ని సినిమాల్లో చేసినా ఏ ఒక్కటీ ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది.
- అప్పట్లో కొడుకు కోసం తండ్రి (సత్యరాజ్) నిర్మాతగా మారాడు. ప్రభు సోల్మన్ దర్శకత్వంలో 'లీ' సినిమాను సత్యరాజ్ నిర్మించారు. అందులో ఫుట్‌బాల్ ప్లేయర్‌గా ఓ ఆట ఆడేశాడు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డులు నమోదు చేసింది. శిబిరాజ్ కెరీర్ కిక్ స్టార్ట్ అయ్యింది. అతడిచ్చిన కిక్‌కు కాసులు కురిశాయి.
- ఈ సినిమా విజయం తర్వాత శిబిరాజ్‌కు అవకాశాలు ఎక్కువ వచ్చాయి. అప్పటి వరకూ చేసిన సినిమాలు ప్రేక్షకులను అలరించకపోయినా నటుడిగా నిరూపించుకున్నాడు.
- అవకాశాలు వచ్చాక ఎవరైనా ఎగిరి గెంతేస్తారు. కానీ శిబిరాజ్ మాత్రం 'లీ' తర్వాత మూడేళ్లపాటు ముఖానికి రంగేసుకోవడం మానేశాడు. స్టార్ట్..కెమెరా..యాక్షన్ అనే పదాలే ఆయన చెవిన పడలేదు.
- ఇక అతడి సినీ కెరీర్ ముగిసిపోయిందనకున్న తరుణంలో 2010లో 'నానయమ్' అనే హారర్ థ్రిల్లర్ చిత్రంలో చేశాడు. ప్రేక్షకులను తెగ భయపెట్టాడు. ఎందుకంటే ఇందులో మొదటసారిగా ప్రతినాయకుడిగా చేశాడు మరి.
- 2008లో ప్రారంభమైన ఈ సినిమా రెండేళ్ల పాటు అనేక ఇబ్బందులు ఎదుర్కొని విడుదల కావడం విశేషం. ఈ సినిమాను గాయకుడు బాలసుబ్రమణ్యం తనయుడు చరణ్ నిర్మించాడు.
- తర్వాత లాస్‌ఏంజెల్స్‌లోని న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీలో నటనలో మెళకువలు నేర్చుకోడానికి వెళ్లిపోయాడు శిబిరాజ్.
- 2014లో మళ్లీ సినిమాల్లో రీఎంట్రీ ఇచ్చాడు. ఈ సారి తండ్రే నిర్మాతగా వ్యవహరించాడు. 'నాయిగల్ జాకిరతై' (కుక్కలు ఉన్నాయి జాగ్రత్త) అనే కామెడీ థ్రిల్లర్‌లో మెప్పించాడు. హాలీవుడ్ చిత్రం 'టర్నర్‌డ్ హూచ్' అనే చిత్రాన్ని ఆధారం చేసుకుని ఈ సినిమాను తమిళంలో తీశారు. సినీ విమర్శకుల ప్రశంసలు దక్కాయి.
- శిబిరాజ్‌కు రేవతి అనే ఐటీ ఇంజనీర్‌తో 2008 సెప్టెంబర్ 14 వివాహమైంది. వివాహానికి ముందు నుంచి వీరిద్దరూ స్నేహితులు కూడా.
- ఈ ఏడాది జీవాతో కలిసి పోకిరా రాజా చిత్రంలో చేశారు. ఇటీవల తెలుగులో విడుదలైన 'దొర'..తమిళంలో 'జాక్సన్ దురై'గా మెప్పించాడు. ఈ చిత్రంలో మరోసారి తండ్రీ కొడుకులు నటించడం విశేషం.
- ప్రస్తుతం 'కట్టప్పావేయ్ కానోమ్'(కట్టప్ప మిస్సయ్యాడు) అనే చిత్రాన్ని చేస్తున్నాడు. హీరోగా శిబిరాజ్ చేస్తున్నాడు. సత్యరాజ్ కూడా ఇందులో నటించబోతుండడం విశేషం. అది కూడా బాహుబలి చిత్రంలో కట్టప్ప పాత్రతోనే ఈ చిత్రంలో సత్యరాజ్ నటించబోతున్నట్లు సమాచారం. బాహుబలి నుంచి పొందిన స్ఫూర్తితోనే పొందే ఈ టైటిల్‌ను పెట్టారట. దీన్ని తెలుగులో కట్టప్ప రాజుగా విడుదల చేస్తారని వినికిడి.

- కొప్పుసెట్టి దేవరాజు



వందేళ్ళ మహిళా వర్సిటీ

రాజా రామ్మోహన్ రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, జ్యోతీరావ్ ఫూలే... సంఘసంస్కర్తలుగా కోట్లాది మందికి తెలిసిన వ్యక్తులు. వారితో పాటు స్త్రీ అభ్యుదయం కోసం పోరాడిన వారిలో దోండో కేషవ్ కార్వే ఒకరు. వితంతు అశ్రమాలని స్థాపించిన కార్వే వారికి విద్యనందించేందుకు తొలి మహిళా విశ్యవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు.. దక్షిణ ఆసియాలోనే మొట్టమొదటి మహిళా విశ్వవిద్యాలయంగా ఊపిరి పోసుకున్న శ్రీమతి నథిబాయ్ దామోదర్ ఠక్రసే ఎస్ఎన్డీటీ విశ్వవిద్యాలయం ప్రస్తుతం శతజయంతిని జరుపుకుంటోంది.

18వ శతాబ్దం ఆరంభంలో అప్పటి ఆచారాలు కట్టుబాట్లలో భాగంగా మహిళలు తమ ప్రాథమిక హక్కులని కూడా అందుకోలేని స్థితిలో అణచివేతకు గురయ్యారు. సతీసహగమనం వంటి సమాజిక దురాచారాలు అక్కడక్కడా కొనసాగుతున్న ఆ రోజుల్లో వితంతు స్త్రీలు నాలుగు గోడలకే పరిమితమయ్యేవారు. వారి జీవితాల్లో మార్పుతేవడంతో పాటు మహిళా అభ్యుదయానికి ఎంతో మంది గళం విప్పటంతో స్త్రీల సామాజిక స్థితిగతుల్లో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. అన్ని మార్పుల మధ్యా పురుషుల్లో అగ్రశాతం మూకుమ్మడిగా తిరస్కరించిన అంశం మహిళా విద్య. నడిపించారు. ఆ సమయంలోనే వితంతు వివాహాలు జరిపించేందుకు ఉద్యమ బాట పట్టిన దోండో కేశవ్ కార్వే 1893లో 'విదవా వివాహోత్తేజక్ మండలి'ని స్థాపించారు. వితంతువులకి పునర్వివాహాన్ని జరిపించడంతో పాటు 1896లో మహిళల స్వయం ప్రతిపత్తి కోసం మహారాష్ట్రలోని పూణేకి అతిసమీపంలో ఉన్న హింజ్నె ప్రాంతంలో ఒక పాఠశాలని స్థాపించారు కార్వే. వితంతువుల కోసం స్థాపించిన ఈ ఆశ్రమ పాఠశాలలోనే ఎంతో మంది బాలికలకు, నిరాధారిత మహిళలకు విద్యని బోధించేవారు. అప్పట్లో విద్యా ఆవశ్యకతను గుర్తించి మహిళలకి అక్షరాలు నేర్పించిన తొలి పాఠశాల కూడా ఇదే. జపాన్‌లోని మహిళా యూనివర్శిటీ గురించి తెలుసుకున్న కార్వే స్త్రీలకి ఉన్నతస్థాయి విద్య అందించడం కోసం మన దేశంలో కూడా జపాన్ తరహాలో విశ్వవిద్యాలయాన్ని నిర్మించాలనుకున్నారు. ఆ ఆలోచనే ఎస్ఎన్డీటీ స్థాపించేలా చేసింది. 1915లో జాతీయ సామాజిక సంస్కరణ కాంగ్రెస్ సభలో తన ఆలోచనని ప్రతిపాదించారు కార్వే. అయితే ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందనా లభించకపోవడంతో 1916 జులై 2న ఐదుగురు విద్యార్థులతో సొంతంగా మొదటి మహిళా యూనివర్సిటీని ప్రారంభించారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త విఠల్ దాస్ ఠక్రసే అందించిన 15లక్షల ఆర్థిక సాయంతో విశ్వవిద్యాలయ భవనాన్ని ఏర్పాటు చేశారు. 1931లో ముంబయిలో మొదటి కళాశాల ఏర్పడింది కూడా ఈ విశ్వవిధ్యాలయం ఆధ్వర్యంలోనే. 1936లో పూణే నుంచి తొలి మహిళా విశ్వవిధ్యాలయాన్ని ముంబయికి మళ్లించారు. ఉన్నత విద్యకోసం ఎక్కువమంది మహిళలు దరఖాస్తు చేసుకుంటుండడంతో 1946లో ఈ విశ్వవిద్యాలయానికి ప్రభుత్వ గుర్తింపు లభించింది. 'ది ఇండియన్ ఉమెన్ యూనివర్సిటీ' పేరుని విశ్వవిద్యాలయానికి ఆర్థిక సాయాన్ని అందించిన ఠక్రసే తల్లి పేరుమీద శ్రీమతి నథీబాయ్ దామోదర్ ఠక్రసే మహిళా విశ్వవిద్యాలయంగా పేరు మార్చారు. 1958లో మహిళలకోసం విశ్వవిద్యాలయాన్ని స్థాపించిన కార్వేని ప్రభుత్వం భారత రత్నతో సత్కరించింది. తొలి నాళ్లలో ఇక్కడ సామాజిక, భౌగోళికాంశాలతో పాటు అల్లికలు, నేత వంటి వృత్తి విద్యల్లో మహిళలకి శిక్షణనిచ్చేవారు. పూణే, ముంబయిలలో మొత్తం మూడు క్యాంపస్‌లలో ప్రస్తుతం 70 వేల మంది విద్యార్థులకి ఉన్నతమైన విద్యనందిస్తోంది. మహారాష్ట్రలోని కొన్ని కళాశాలలతోపాటు అస్సాం, ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, సూరత్, గోవా ప్రాంతాలకి చెందిన కళాశాలలెన్నో 'ఎస్ఎన్డిటి'కి అనుబంధ సంస్థలుగా పనిచేస్తున్నాయి. సామాజిక పరిస్థితుల్లో మార్పుకి తగ్గట్టుగా టెక్నాలజీకీ సంబంధిత కోర్సులు, పోస్టుగ్రాడ్యుయేట్, రీసెర్చ్‌లతోపాటు, ఫుడ్ టెక్నాలజీ, ట్రావెల్ అండ్ టూరిజం, జ్యూవెలరీ డిజైనింగ్, అప్పేరల్ డిజైనింగ్ వంటి వృత్తి విద్యాకోర్సుల్ని ఎస్ఎన్డిటి అందిస్తోంది. నేషనల్ ఎసెస్‌మెంట్ అండ్ ఎక్రిడిటేషన్ (న్యాక్) ఇచ్చే గుర్తింపు పొందడం విశ్వవిద్యాలయాలు ప్రతిష్మాత్మకంగా భావించే అంశం. న్యాక్ 5స్టార్ గుర్తింపు పొందిన తొలి విశ్వవిద్యాలయం కూడా ఎస్ఎన్డిటియే. కళారంగాల్లో పేరొందిన భారతీ వైశంపాయన్, రాణీముఖర్జీ, సోనాక్షీ సిన్హా, అనితా డోంగ్రే వంటి ఎంతో మంది ఇక్కడ చదువుకున్న వారే.

కార్టూన్ పంచ్



నవ్వుల్ - పువ్వుల్

పారగాన్

చెత్త కుండీలో కొన ఊపిరితో ఉన్న రెండు బొద్దింకలు ఇలా మాట్లాడుకుంటున్నాయి.

మొదటి బొద్దింక: "నీది కూడా బేగాన్ దెబ్బేనా?

రెండో బొద్దింక: కాదు...పారగాన్ దెబ్బ"

మూలుగుతూ చెప్పింది.



పెళ్ళి

అమ్మాయి: ఈ సారి ఎగ్జామ్‌లో ఫెయిల్ అయితే మా నాన్న నాకు పెళ్ళి చేస్తా అన్నాడు.

అబ్బాయి: అవునా... మరి ఎలా ప్రిపేర్ అవుతున్నావు..?

అమ్మాయి: నా పనులన్నీ అయిపోయాయి...ఒక రిసెప్షన్‌కు బట్టలు కొనాలంతే...!!!

మెదడు- నాలుక

టీచర్: మానవ శరీరంలో అన్నింటికంటే ఎక్కువగా,తక్కువగా ఉపయోగించే భాగాలు ఏమిటి?

గిరీశం: మెదడు- నాలుక టక్కున చెప్పాడు గిరీశం.

ఏం నేర్చుకున్నావ్?

ఒరేయ్ చింటూ ఈ రోజు స్కూల్లో ఏం నేర్చుకున్నావురా? అడిగాడు తండ్రి.

అందరి తల్లిదండ్రులు పాకెట్ మనీ ఇస్తారు గానీ నువ్వు ఇవ్వవని తెలుసుకున్నా నాన్న..!! అని చెప్పాడు కుమారుడు.



ఇంటికి దీపం ఇల్లాలు.. ఈ మాట కాస్త పాత బడింది.. ఇంకాస్త వెనక్కు మళ్లింది. ఇప్పటి మాట భూమికి దీపం ఆడపిల్ల. ఇల్లాలి కంటే ముందే ఆమె ప్రపంచానికి ఆధారం కాబోతోంది. ఇది ఆడబిడ్డ అంటే ప్రాణమిచ్చేవాడి మాట కాదు. ప్రపంచ ఆర్థికవేత్తలు, సామాజికవేత్తలు, పర్యావరణవేత్తలు, ఆరోగ్యవేత్తలు కలసి అంటున్న మాట. ఇక్కడ భూమి అంటే జనం కూడా. ఇక్కడ వెలుగు పొందేది భూమి కూడా. మనిషి-ప్రకృతి బాగుండాలంటే ఆడపిల్లే ఆధారమంటున్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ప్రకటించిన ఈ విషయంపైనే ఈ వారం అట్టమీది కథ.

అమ్మే ఆధారం

అజయ్ కుమార్ వారాల
-9502395077

ఆడపిల్లకు చదువు చెబితే సరిపోదు.. ఎప్పుడు పెళ్లి చేసుకోవాలి.. ఎప్పుడు పిల్లల్ని కనాలి.. ఎంతమందిని కనాలనే విషయంపై నిర్ణయాధికారం ఆమెకు వదిలేయాలి. అప్పుడు ప్రతి ఇల్లు వెలుగుతుంది.. ఆ కాంతి ధరణి అంతటా విస్తరిస్తుంది. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఆమెకు నిర్ణయాధికారం దక్కాలని ఐక్యరాజ్యసమితి కార్యక్రమాలు రూపొందిస్తోంది. పెళ్లీడుకొచ్చే ఆడపిల్లలకు లైంగిక, పునరుత్పత్తి విషయాలపై విద్యనందించాలని కోరుతోంది. జనాభా పెరుగుదలను నియంత్రించాలంటే ఆమెనే ముందుగా చైతన్యవంతురాల్ని చేయాలనే కీలక విషయాన్ని నొక్కి చెబుతోంది. పాపులేషన్ బాంబ్‌ను చూసి బెదిరిపోకూడదంటే ఆమె ఆసరా తీసుకోవాలని గట్టిగా చెబుతోంది. కుటుంబ నియంత్రణ విషయంలో ఆమెకు నిర్ణయాధికారాన్నిస్తే పరిస్థితి చాలా వరకు చక్కదిద్దుకుంటుందనే ఈ వాదనకు బలమైన అంశాలే కారణమవుతున్నాయి.

1989 ప్రపంచ జనాభా 500 కోట్ల మార్కును దాటింది. అప్పుడే జనాభా ఉత్పాతం ప్రభావం తాకింది. జనాభా నియంత్రణ లేకపోతే తీవ్ర పరిణామాలుంటాయని గమనించిన ఐక్యరాజ్య సమితి ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ప్రకటించింది. జనాభా నియంత్రణ ఎంత అత్యావశ్యకమనే విషయాన్ని దేశ ప్రభుత్వాలకే కాకుండా పౌరులకు కూడా చేరేలా కార్యక్రమాలు చేపట్టింది. అప్పటి నుంచి ఒక్కో ఏడాది ఒక్కో అంశాన్ని ప్రముఖంగా జనాల్లోకి తీసుకెళుతూ అవగాహన కల్పిస్తోంది. ఈ ఏడాది నవ యువతపై దృష్టి పెట్టింది. గర్భ నిరోధక పద్ధతులపై టీనేజర్లకు అవగాహన కల్పించాలనేది ప్రధానోద్దేశం. ప్రపంచ జనాభాలో టీనేజర్ల శాతమే ఎక్కువ. అది కూడా అత్యధిక జనాభా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఉంది. ఆ దేశాల్లో సగం మంది టీనేజర్లే. వాటిల్లోనే బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 52 శాతం మంది యువతే. ఆధునిక కుటుంబ నియంత్రణ విధానాలు, గర్భ నియంత్రణ పద్ధతులు, కనీస లైంగిక, పునరుత్పత్తి విద్య వంటివి



వీరికి అందుబాటులో ఉండటం లేదు. 15-17 ఏళ్లకే ఇద్దరు ముగ్గురు బిడ్డలకు తల్లులవుతున్నారు. ఇది మాతా శిశు మరణాలకు ప్రధాన కారణం. కీలక దశలో ఆరోగ్య సమస్యలు, అసంపూర్ణ విద్య అనేది ఆమెతోపాటు పిల్లల పెంపకం, భవిష్యత్తుపై దుష్ప్రభావాన్ని చూపెడుతోంది. టీనేజర్ల దగ్గర ఈ సమస్యకు పరిష్కారం చూపితే అది గొలుసుకట్టు చర్యగా మారి ప్రపంచ సమస్యకు పరిష్కారం చూపుతుంది. అందుకే దృష్టంతా టీనేజర్ల మీదే పెట్టింది. నిర్ణయాధికారం వారిదే అయితే ఆరోగ్యవంతమైన జీవనంలో ఓ మెట్టు ఎక్కినట్టే. ఇది ఆరోగ్యకరమైన మరో తరానికి పునాది వేస్తుంది.

ఏం జరుగుతోంది

ఈ శతాబ్దం చివరి నాటికి ప్రపంచ జనాభా 1100 కోట్లకు చేరుకోనుందని ఐక్యరాజ్యసమితి లెక్కలు. ఓ వైపు యూరప్‌లో జననాల రేటు తగ్గుతోంది. మరోవైపు చైనాలో వృద్ధుల సంఖ్య గణనీయంగా పెరిగిపోతోంది. ఆఫ్రికా దేశాల్లో కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు ఊపందుకున్నాయి. భారత్‌లో గత దశాబ్దం నాటి కన్నా ఇప్పుడు జననాల రేటు కాస్త మందగించింది. అయినా పాపులేషన్ బాంబ్ నెమ్మదించడం లేదు. ప్రతి సెకనుకు జనన, మరణ లెక్కలు దాటుకొచ్చి ఇద్దరు భూమ్మీద పెరుగుతున్నారు. వీరందరినీ భూమి కాచుకోవాలి. ఇప్పటికే ముడి ఖనిజాలు అడుగంటుకుపోయిన దాఖలాలు. ఆహార, మంచి నీటి లభ్యత లేమి ఇప్పటికే 100 కోట్లకు పైగా జనాభాను ఆకలి మంటల్లో పడేస్తోంది. వీటి కోసం మరింత అన్వేషణ మరింత పర్యావరణ చేటుకు కారణమవుతోంది. పర్యావరణం దెబ్బతింటే వాతావరణంలో పెను మార్పులొచ్చి వైపరీత్యాలు పెరుగుతాయి. వాటి వల్ల అదనపు ఆస్తి, ప్రాణ నష్టాలు. తెలీకుండానే ఓ వినాశకర చట్రంలో పడిపోతున్నాం. ప్రతి 20 నిమిషాలకు

3000 మంది జన్మిస్తుంటే అదే సమయంలో ఓ వృక్ష లేదా జంతు జాతి సమూలంగా తుడుచుపెట్టుకుపోతోంది. కోట్ల ఏళ్ల క్రితం రాకాసి బల్లులు అంతరించిపోయిన సమయంలో చివరి మహా వినాశనం భూమి మీద చోటు చేసుకుందని శాస్త్రవేత్తలు అంటున్నారు. అప్పుడు అగ్నిపర్వతాల మహా విస్ఫోటనలో, ఆస్టరాయిడ్ తాకిడి వల్లో జీవనాశం జరిగితే ఇప్పుడు మనిషి అదుపులేని విధ్వంసం వల్ల ప్రకృతిహననం జరుగుతోంది. ఏడాదికి 27 వేల జీవ జాతులు భూమ్మీద కనుమరుగవుతున్నాయి. 5 మహా వినాశనాల టైమ్‌లైన్ కన్నా ఇది మరీ వేగంగా జరిగిపోతోందని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. ఈ ఆరో మహా వినాశనానికి పరుగులు తీయిస్తోంది మనిషే.

ఇప్పట్లో చోటుందా?

జనం రెట్టింపైతే గృహాల కోసం, వ్యవసాయం, పరిశ్రమల కోసం అడవుల నరికివేత ఎక్కువైపోతుంది. భూమి ఇవ్వగలిగిన దాని కన్నా మూడు రెట్ల డిమాండ్ ఎక్కువవుతుంది. ప్రస్తుతం ఉన్న వ్యవసాయ భూమి కన్నా ఇంకా విస్తరించగలిగిన స్థలం భూమ్మీదైతే లేదు. మరో 300 కోట్ల మందికి కూడా దీనిలోనే పండించగలగాలి. ఇప్పటికే 70 శాతం మంచినీటిని వ్యవసాయానికి వాడేస్తున్నాం. భూతాపం వల్ల ఎడారి ప్రాంతం అదుపుచేయనంతగా పెరిగిపోతోంది. ప్రపంచ దేశాలు నీటి యుద్ధాలకు చేరువవుతోంది జనాభా సమస్య వల్లే. మరి ఈ సమస్యకు పరిష్కారం లేదా? జన సంద్రం వల్ల మంచేమీ లేదా? అంటే ఓ సరికొత్త వాదనను కొందరు తెరపైకి తెస్తున్నారు. జనాభాను విలువైన మానవ వనరుగా చూస్తున్నారు. ఎందుకంటే మొత్తం భూమ్మీద ఉన్న మనుషులందరినీ ఒక చోటకు చేర్చి పక్కపక్కనే నిలబెడితే కేవలం 1300 చదరపు కిలోమీటర్ల స్థలం సరిపోతుందట. అది లాస్ ఏంజెల్స్ మహా నగరం కన్నా తక్కువ స్థలమే ఉంటుందట. ఇప్పటి కన్నా రెట్టింపు అయినా కూడా ప్రమాదకరం కాదనేది ఓ వాదన. కాకపోతే, మానవ అవసరాలనేవి ప్రకృతిని ధ్వంసం చేసే పద్ధతిలో కాకుండా ప్రకృతితో మమేకమై పర్యావరణ హితంగా ఆహారాన్ని సమకూర్చుకోవడం, వస్తువుల వినియోగంలో పొదుపు పాటించడం, వృథా అవుతున్న లక్షల టన్నుల ఆహారాన్ని కాపాడుకోగలగడం వంటివి కొంత మార్పు చూపెడతాయని అంటున్నారు. అలానే ముడి ఖనిజాల కోసం భూమిని తవ్వకుండా వేరే గ్రహాల నుంచి తెచ్చుకోవాలని, పునరుత్పాదక శక్తి వనరుల్ని వినియోగించాలని

అద్దె గ్రహం

అత్యంత చేరువలో నివాస యోగ్యంగా ఉన్న గ్రహం అంగారక గ్రహం. అక్కడికి చేరుకుని మానవ కాలనీలు ఏర్పాటు చేసే లక్ష్యం ఒక్క నాసా లాంటి ప్రభుత్వ అంతరిక్ష సంస్థలకే కాదు ప్రైవేట్ కంపెనీలు కూడా ఈ విషయంలో ఓ కల ఎక్కువే కంటున్నాయి. స్పేస్ ఎక్స్, వర్జిన్ గేలాక్టిక్, బ్లూ ఆరిజిన్, స్ట్రాటోలాంచ్ సిస్టమ్స్ వంటి సంస్థలు ప్రయోగాలు ప్రారంభించేశాయి. స్పేస్ ఎక్స్ స్థాపన లక్ష్యం మానవుని గమనం ఇతర గ్రహాలకు చేర్చడమని ఇలాన్ మస్క్ చెప్పుకొచ్చారు. వాటిని చేజిక్కుంచుకున్నాక అవీ భూమిలా విధ్వంసం కాబడితే తర్వాతి అడుగు.! అందుకే అదుపు ఆవశ్యకమైంది. వలస పాలనల గుణపాఠాలు ఇంకా బోధపడలేదనే అర్థం చేసుకోవాలి. ప్రఖ్యాత సైన్స్ రచయిత బెన్ బోవా ఓ మాట గుర్తు చేస్తారు. అత్యవసర విషయంలోనే తలమునకలైతే, ముఖ్యమైంది చేయలేమని అంటారు. పేదరికం, ఆకలి మంటలకు ఇంకా జవాబు వెతికే ప్రయత్నంలో ఉండగా గ్రహాంతర జీవనానికి దారులు ఎలా తెరుచుకుంటాయని ప్రశ్నిస్తారు. సముద్రాల్లో తేలాడే నగరాల కోసం డిజైన్లు రూపుదిద్దుకుంటున్నాయి కానీ తుఫాన్లను తట్టుకుని ఇవి నిలబడతాయా అనే విషయం ప్రాక్టికల్‌గానే తెలుస్తుంది.



వీలైతే మరో అడుగు ముందుకేసి కొన్ని సెటిల్‌మెంట్లను అంతరిక్షం ఎక్కించాలని చెబుతున్నారు.

వాస్తవాలేంటి..

వాస్తవం మరోలా ఉంది ప్రస్తుతం ఉన్న ఆహార సంక్షోభానికే పరిష్కారం చూపలేకపోతున్నారు. వ్యాపారీకరణ తీవ్రమైన వ్యవసాయ రంగం కొత్త సమస్యలకు దారినిస్తోంది. కొన్ని రకాల వంగడాలే ఎక్కువగా పండించడంతో ఏదైనా జన్యుపరమైన లేదా

జన సంద్రం

- ఇంతకు ముందు ఎన్నడూ లేనంతగా యువ జనాభా ఉంది. సుమారుగా 200 కోట్ల మంది 10-24 ఏళ్ల వయస్సులోపు వారని లెక్కలు. అభివృద్ధి చెందని 48 దేశాల్లో వీరి జనాభానే మిగతావారి కన్నా ఎక్కువ. ప్రపంచ జనాభాలో 52 శాతం 30 ఏళ్ల లోపు వయస్సు వారే. సగటు మనిషి వయస్సు 28 ఏళ్లు.
- 200 ఏళ్ల క్రితం 100 కోట్లకు ప్రపంచ జనాభా చేరుకుంది. ఈ అంకెను చేరుకోవడానికి కొన్ని వేల ఏళ్లు పట్టింది. కానీ కేవలం రెండు శతాబ్దాల్లో ఆ సంఖ్య 700 కోట్లు దాటేసింది. మరో వందేళ్లలో 12 వందల కోట్లకు చేరే అవకాశం ఉంది.
- ప్రస్తుతం భూమ్మీద 740 కోట్ల మంది జనాభా ఉంది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 7 కోట్ల 33 లక్షల మంది వరకు జన్మిస్తే మరణించింది 3 కోట్ల మంది అని వరల్డో మీటర్స్ లెక్కలు.
- 2011 నాటికి భూమ్మీద 10,800 కోట్ల మంది జీవించారని అంచనా.
- క్రీ.శ. 10వ శతాబ్దం నాటికి భూమ్మీద 40 కోట్ల మంది ఉంటే ఆ సంఖ్య రెట్టింపు కావడానికి 750 ఏళ్లు పట్టింది. 1804లో 100 కోట్లకు చేరుకుంది. 1927లో 200 కోట్లకు, 1960 నాటికి 300 కోట్లకు చేరింది. ఆ తర్వాత కేవలం 40 ఏళ్లలో జనాభా రెట్టింపై 600 కోట్లకు చేరుకుంది.
- ప్రతి క్షణానికి నలుగురు పుడితే ఇద్దరు మరణిస్తున్నారు. అంటే క్షణం క్షణం మరో ఇద్దరు జనాభాకు తోడవుతున్నారు. ఏడాదికి 8 కోట్ల 30 లక్షల మంది పెరుగుతున్నారు. పెరుగుదల రేటు 1.18 శాతం. గత దశాబ్దం (1.24) కంటే తక్కువే అయినా జనాభా సంఖ్య ఎక్కువ కావడం వల్ల జనాభా బాంబ్ పేలుతోంది.
- 1800లో కేవలం 3 శాతం మందే నగరాల్లో నివసించేవారు కానీ ఇప్పుడది 50 శాతానికి పెరిగింది. 2050 నాటికి 70 శాతం మంది పట్టణాల్లో నివసిస్తారని అంచనా.
- 1900లో పది లక్షల జనాభా దాటిన నగరాలు ప్రపంచవ్యాప్తంగా కేవలం 12 మాత్రమే ఉండేవి. ఇప్పుడది 400 నగరాలకు దాటింది. కోటి జనాభా కన్నా ఎక్కువ ఉన్న మహా నగరాలే 19 ఉన్నాయి.



సూక్ష్మజీవి సంబంధిత తెగులు సోకితే లక్షల ఎకరాల్లో పంట నాశనమయ్యే అవకాశముందని పరిశోధకులు అంటున్నారు. ఇలాంటి సమస్యలకే ఇంకా సన్నద్ధం కాని పరిస్థితిలో రెట్టింపు జనానికి ఆహార భరోసా ఎలా ఇవ్వగలరు. ఎంత వేగంగా శాస్త్ర సాంకేతిక అభివృద్ధి చెందినా వాటి ఫలాల్ని పేదింటికి పరిచయం చేసే అవకాశమెంత. సాంకేతికాభివృద్ధి అటు పరిశ్రమల్లో రోబోల సంఖ్యను పెంచేస్తూ ఉపాధికి గండికొడుతోంది. వీటిని నడిపే వృత్తులు ఎంతమందికి ఉపాధినిస్తాయో తెలీదు. మనమో ఆదర్శ ప్రపంచంలో కాకుండా పోటీ ప్రపంచంలో ఉన్నామనే సంగతిని గుర్తెరిగితే ఊరకే ఉండనిచ్చి తిండిపెట్టే దశ అనేదే రాదనే కఠిన వాస్తవం అర్థమవుతుంది. అందుకే జనాభా నియంత్రణ పాటించడం ముఖ్యమవుతోంది.

చెత్తే పెద్ద సమస్య

2025 నాటికి 430 కోట్ల మంది నగరాల్లో జీవిస్తారని అంచనా. అంటే ఏటా ఒక్క పట్టణ ప్రాంత ప్రజలే 240 కోట్ల టన్నుల వ్యర్థాల్ని ఉత్పత్తి చేస్తారని లెక్కలు. ఇప్పటికే ల్యాండ్‌ఫిల్స్ నిండిపోయాయి. సముద్రాల్లో దీవులు చెత్తతో నిండిపోయాయి. ఇవికాక ఓ మహా నగరమంత పరిమాణంలో ఉన్న చెత్త కుప్పలు మహా సముద్రాల్లో తేలియాడుతున్నాయి. ఇవి అత్యంత కాలుష్యకారకాలుగా జీవజాలాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయి. ఉత్తర పసిఫిక్ సముద్రంలోని 'గ్రేట్ పసిఫిక్ గార్బేజ్ ప్యాచ్'ను చూస్తే విస్తుపోతారు. 7 లక్షల చదరపు కి.మీ. నుంచి కోటీ 50 లక్షల చదరపు కి.మీ.ల వరకు ఉండొచ్చని శాంప్లింగ్‌తో తేలింది. కొన్ని నివేదికల ప్రకారం అమెరికా దేశమంతా సైజులో ఉన్నా ఆశ్చర్యపోవాల్సింది లేదంటున్నారు. రీసైక్లింగ్ ద్వారా ఎంత పరిమాణం వ్యర్థాలను తిరిగి వినియోగంలోకి తీసుకురాగలరనే విషయానికి నేటికి సమాధానం లేదు. అంతరిక్షానికి తరలించి బూడిద చేయాలనే వాదన ఉన్నా ఖర్చు పెద్ద అడ్డంకిగా మారుతోంది. ఇప్పుడున్న జనాభా ఇలాగే ఉన్నా కూడా ఇది పెను సమస్యే. ఇక జనాభా పెరుగుతూ పోతే పర్యావసానాలు తీవ్రమవుతాయని లీడ్స్ విశ్వవిద్యాలయ పరిశోధకులు అంటున్నారు. దీనితో పాటు మానవ వ్యర్థాల సమస్య ఉండనే ఉంది. ప్రస్తుతం 260 కోట్ల మంది ప్రజలు కనీస పారిశుధ్య అవసరాలకు దూరంగా ఉన్నారు. ఒక్క గంగానదిలోనే ప్రతి నిమిషానికి 11 లక్షల లీటర్ల మురుగు కలుస్తోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కలు. ఇక మిగతా జీవ నదుల సంగతేంటో అర్థమయ్యే ఉంటుంది. నదీ జలాల కాలుష్యం తాగు నీటి లభ్యతను పెద్ద మొత్తంలో తగ్గించేస్తుంది. అంటు వ్యాధులు ప్రబలడంతో పాటు దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు, కొత్తగా పుట్టుకొచ్చే జబ్బుల సమస్యల్ని జనాభా పెరుగుదల మరింత జఠిలం చేస్తుంది. 1940 నుంచి 2004 మధ్య కొత్తగా 300 వ్యాధులు పుట్టుకొచ్చాయని ఎకో హెల్త్ అలియన్స్ అధినేత డాక్టర్ పీటర్ డ్సజాక్ వివరిస్తారు. జనాభా పెరుగుదలకు, వ్యాధుల పుట్టుకకు సంబంధం ఉందని ఆయన పరిశోధనలతో తేల్చి చెప్పారు. మందులకు లొంగని మలేరియా, టీబీ వ్యాధులకు కొత్త రకపు పాథోజెన్‌లు కారణమవుతున్నాయని నిరూపించారు.విశృంఖల పట్టణీకరణ ఈ సమస్యను మరింత జఠిలం చేయనుంది.

ధనిక దేశాల్లోని కేవలం 50 కోట్ల మంది వినియోగమే పర్యావరణానికి అత్యంత ప్రమాదకరంగా తయారైతే రోజురోజుకీ ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న అభివృద్ధి చెందుతున్న



దేశాల జనాభా వినియోగదారీతత్త్వం మరింత సవాల్‌గా మారనుంది. వినియోగదారీతత్త్వం జనాభా పెరుగుదల కన్నా పెను సమస్యని వాదించే వారు మరిచిపోతున్న విషయమిదే.. జనాభా పెరుగుదల వినియోగదారీతత్త్వం మరింత పెంచేస్తుందని. చాలా కొద్ది మొత్తంలో మాత్రమే కార్బన్ ఎమిషన్, వస్తు వినియోగం చేస్తున్న పేద దేశాలు కూడా అభివృద్ధి పథాన నడవాల్సిందే. అంటే మరింత వినియోగం పెరుగుతుంది. దీన్ని ఎవరూ ప్రశ్నించలేరు. అది వారి హక్కు, వాటా కూడా. కానీ వారి అవసరాలు తీరేదెలా అనేదే పెద్ద మిథ్యగా మారింది.

ఆక్వాపోనిక్స్, వర్టికల్ ఫార్మింగ్, ఫేక్ మీట్ వంటి ఆహారోత్పత్తి ప్రత్యామ్నాయాలు, సముద్ర జలాల నుంచి తాగునీటి తయారీ, ఇతర గ్రహాల్లో నివాసాలు, ఆస్టరాయిడ్ బెల్ట్ నుంచి ఖనిజాల సరఫరా, సర్వ రోగ నివారిణులు వంటివి సాధ్యమయ్యే లోపు ఇప్పటి పెను సమస్య నుంచి బయటపడాలంటే జనాభా నియంత్రణే పరిష్కారం. అది స్వతహాగా, స్వచ్ఛందంగా ఉండాలి. అది మన ఇంటి నుంచే మొదలవ్వాలి. లేకుంటే ప్రకృతే ఆ పనిచేస్తుంది. గతి తప్పిన పర్యావరణమే ప్రకృతి విపత్తులతో తిరగబడి పెను విధ్వంసం సృష్టిస్తోంది. మన ఊళ్లో కిందటి ఏడాది వర్షాలు ఎలా కురిసాయో, ఎప్పుడు కురిసాయో... ఎక్కడో కరువు, వరదలు మన ఇంటి పక్కన సరుకుల కొట్టులో వస్తువుల్ని ఎలా కొరత చేస్తున్నాయో తెలుసుకుంటే చాలు. ఇదంతా కుటుంబ పెద్దకు తెలిస్తే సరిపోదు. ఆ ఇంటి ఆడ బిడ్డకు చేరితేనే సమస్య పరిష్కారమవుతుంది. తర్వాతి తరాలపై ఈ చైన్ రియాక్షన్ ఉంటుంది. అది మనిషి చేస్తున్న విధ్వంసం నుంచి భూమిని కాపాడుతుంది. అమ్మే ఆధారం.

✦

తల్లి కష్టం

- కాన్పు సమయాల్లో సబ్ సహారన్ ఆఫ్రికాకు చెందిన గర్భిణులు ఎక్కువగా మరణిస్తున్నారు. 19వ దశకంలో ఇంగ్లండ్‌లో ఇవే పరిస్థితులుండేవి. ప్రతి లక్ష కాన్పులకు 510 మంది గర్భిణుల ప్రాణాలు పోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రతి రోజు ఇలా 800 మంది చనిపోతున్నారు. ఇవన్నీ నివారించదగ్గ మరణాలే.
- అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 22.5 కోట్ల మంది మహిళలు గర్భ నియంత్రణని పాటించాలనుకుంటున్నా వారికి అధునాతన గర్భనిరోధక మందులు అందడం లేదు. నాటు పద్ధతుల వల్ల గర్భిణులు, నవజాత శిశువుల మరణాలు సంభవిస్తున్నాయి. అదే అధునాతన పద్ధతుల్ని పాటించినట్లయితే 70-80 శాతం వరకూ ఈ మరణాల్ని ఆపొచ్చు.
- రోజుకు ప్రపంచవ్యాప్తంగా 37 వేల బాల్య వివాహాలు జరుగుతున్నాయని నివేదికలు. బాలికల మరణాంతకాల్లో రెండో ప్రమాదకారిగా గర్భస్థ సమస్యలు నిలిచాయి. ప్రతి రోజు 20 వేల మంది బాలికలు బిడ్డలకు జన్మనిస్తున్నారు.
- అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రతి ముగ్గురు అమ్మాయిల్లో ఒకరికి 18 ఏళ్ల లోపే నాటికే వివాహం జరుగుతోంది.
- మూడవ వంతు జనాభా పెరుగుదలకు అనివార్య, నియంత్రణ అవకాశం లేని గర్భాలే కారణం. ఆధునిక కుటుంబ నియంత్రణ, గర్భ నిరోధక పద్ధతులు అందుబాటులోకి వస్తే ఈ సమస్యలకు పరిష్కారం కలిగినట్టే.
- ఆకలితో అల్లాడుతున్న వారి సంఖ్య 100 కోట్లు దాటితే, 66 కోట్ల మందికి మంచి నీరు అందడంలేదు. 240 కోట్ల మందికి మరుగుదొడ్డి సౌకర్యమే లేదు.
- 70 కోట్ల మంది బాలికలకు 18 ఏళ్లలోపే పెళ్లిళ్లు జరిగాయి. గతేడాది కోటి యాభై లక్షల మంది బాలికలకు వివాహాలు జరిగాయి.
- యుద్ధ పరిస్థితుల వల్ల 4 కోట్ల 20 లక్షల మంది శరణార్థులుగా మారితే వారిలో 80 శాతం మంది మహిళలు, చిన్నారులే ఉన్నారు. వ్యవస్థీకృత లైంగిక దోపిడీ, శారీరక, మానసిక హింస, దాడులకు గురౌతున్నారు.

మనిషి గురించి..

- ప్రపంచంలోని ప్రతి మనిషిని పక్క పక్కనే నిలబెడితే మొత్తం కలిసి లాస్ ఏంజెల్స్ (1300 చదరపు కిలోమీటర్లు) అంత చోటు కూడా పట్టదు.
- ప్రపంచంలో అందరి కంటే ఎక్కువగా 'మొహమ్మద్' అనే పేరు పెట్టుకున్నవాళ్లు న్నారు. ఆడవారిలో 'మరియా/మేరీ' ఎక్కువగా పేరుగడించింది.
- 5వ బిలియన్ బేబీగా 1987 జులై 11న క్రొయేషియాలోని జాగ్రెబ్‌లో జన్మించిన మాటెజ్ గాస్పర్‌ను ఐరాస ప్రకటించింది. 6వ బిలియన్ బేబీగా 1999 అక్టోబర్ 12న పుట్టిన బోస్నియా, హెర్జెగోవినాకు చెందిన అద్నాన్ మెవిక్‌ను గుర్తించారు.
- చైనా 138 కోట్లు, భారత్ 132 కోట్లు, అమెరికా 32.4 కోట్లు, ఇండోనేషియా 26 కోట్లు, బ్రెజిల్ 21 కోట్ల జనాభాతో తొలి స్థానాల్ని ఆక్రమించాయి. అంటే సగం జనాభా ఈ 5 దేశాల్లోనే ఉందన్నమాట. కొన్నేళ్లలో భారత్ జనాభా చైనాను మించిపోతుంది.
- అత్యధిక ధనవంతుల్లో కేవలం 20 శాతం మంది 86 శాతం వస్తువుల్ని, 45 శాతం మత్స్య, మాంసాహారాల్ని, 58 శాతం విద్యుత్ తదితర శక్తి వనరుల్ని వాడుతుంటే పేదల్లో 20 శాతం మంది కేవలం 1.3 శాతం వస్తువుల్ని, 5 శాతం మత్స్య, మాంసాహారాల్ని, 4 శాతం శక్తి వనరుల్ని మాత్రమే వినియోగిస్తున్నారు. ఇంకా విస్మయపరిచే విషయమేమంటే కేవలం 12 శాతం మంది ధనికులు 85 శాతం నీటిని తోడేస్తున్నారు.

వింత లోకం

మాస్కోలో రీపర్

బ్యాట్‌మేన్ సినిమాలు చూసి ప్రేరణ పొందిన ఓ రష్యా కుర్రాడు రాత్రుళ్లు ముసుగు వీరుడిగా తిరుగుతూ మాదక ద్రవ్యాల డీలర్ల పనిపడుతున్నాడు. మాస్కో శివారు ప్రాంతంలోని ఖిమ్కీలో ఇప్పటి వరకు 40 మంది నేరగాళ్లను ఉతికారేసి పోలీసులకు చిక్కేలా చేశాడు. బ్యాట్‌మేన్ ఆహార్యంతో చీకటిలో మాయమయ్యే ఆ వ్యక్తి అక్కడ సంచలనమయ్యాడు. మానవుల తొలి నిజమైన సూపర్ హీరో 'రీపర్'నని నేరాల్ని నియంత్రించడంలో సహాయం చేయాలని పోలీసులకు ఉత్తరం కూడా రాశాడు. రేపిస్టులు, గ్యాంగుల భరతం కూడా పడతానని అందులో రాశాడు. పోలీసుల్లో నేరగాళ్లు పెరిగిపోయి నిజాయితీగల అధికారులు ఏమీ చేయలేనిస్థితికి సమాజం చేరుకుందని అందుకే తానొచ్చానని చెబుతున్న రీపర్ పేరు కోసం కాకుండా మార్పు కోసమే పనిచేస్తున్నానని సామాజిక మాధ్యమాల్లో ప్రకటిస్తున్నాడు. ఓ క్యాబ్ డ్రైవర్‌కు తొలుత రీపర్ కనిపించాడు. అతడు చూస్తుండగా.. ఓ గ్యాంగ్ డెన్‌లోకి వెళ్లిన అతడు అక్కడ భీకర పోరాటం చేసి పోలీసులకు నేరస్తులు చిక్కుబడేలా చేసి చీకట్లో మాయమయ్యాడట.

ఫోన్‌ను పెళ్లాడి..

అమ్మాయి కన్నా స్మార్ట్‌గా తన స్మార్ట్ ఫోన్ కనిపించిందట అమెరికాకు చెందిన ఆరోన్ చెర్వెనాక్‌కి. అందుకే దాన్ని లాస్ ఏంజెల్స్ నుంచి లాస్ వెగాస్, నెవడాలు తిప్పి పెళ్లి చేసుకున్నాడు. అవునండీ నిజం. రాత్రి నిదురపోయేపుడు చివరిసారిగా చూసేది, పొద్దునే నిద్ర లేచి లేవగానే అందుకునేది అదే కాబట్టి అంత కన్నా ప్రియ సఖి ఏముంటుందని ఎదురు ప్రశ్నిస్తున్నాడు. మనోడికున్న వెర్రి స్మార్ట్‌ఫోన్‌లు వాడే పావు వంతు మందికి ఉందని కేస్పరోవ్‌స్కీ సంస్థ సర్వే ద్వారా తెలుస్తోంది. తమ మొబైల్ ఫోన్లను కన్న తల్లిదండ్రులతో సమానంగా చూస్తామని ర్యాంకింగ్ ఇచ్చేశారట జనాలు. అందుకే చెర్వెనాక్ చేతిలో ఫోనేసి దానికో రింగ్ తొడిగేసి సంప్రదాయబద్ధంగా ఓ చాపెల్‌లో పెళ్లి తంతు ముగించాడు. పర్పుల్ రంగు క్యాడిలాక్‌లో వధువును సారీ.. స్మార్ట్‌ఫోన్‌ను పెళ్లి వేదిక వద్దకు తీసుకొచ్చానని ఒకింత గర్వంగా చెబుతున్నాడు. పక్కనోళ్లకేమో అతడి వాలకం వేరేలా అనిపిస్తోంది.



కుక్క కాలికి టీవీ రిమోట్

మనుషులతో సమానంగా కుక్కలు టీవీ చూసేస్తున్నాయని, యజమాని బయటకెళితే బోర్ కొట్టకుండా టీవీ ముందు కాలక్షేపం చేస్తున్నాయని బ్రిటీష్ సంస్థొకటి చెబుతోంది. వారి సర్వేలో 91 శాతం మంది యజమానులు తమ కుక్కలు టీవీకి అతుక్కుపోతాయని సెలవివ్వడంతో వారు వాటికోసం ప్రత్యేకంగా ఓ రిమోట్ రూపొందించేశారు. కుక్క పాదాన్ని పోలినట్టు బటన్‌లను అమర్చారు. ఇంకా ఓ ఎముక ఆకారంలో కంట్రోల్‌ను తయారు చేశారు. వీటిని కుక్కలు తేలిగ్గా ఉపయోగించుకోగలవని చెబుతోందా సంస్థ. అంటే కొన్నాళ్లకు పిల్లా పెద్దలే కాదు ఏ టీవీ కార్యక్రమాలు చూడాలనే విషయంలో కుక్కలు రిమోట్ లాక్కుంటాయన్న మాట.



ఓ వృద్ధ జంట తమ గ్రామం తీరును మార్చేసింది. యువకులకు సాధ్యం కాని చైతన్యాన్ని గ్రామస్తుల్లో రగిలించింది. పక్క గ్రామాలు కూడా పారిశుద్ధ్యం దిశగా అడుగులు వేసేలా ఊతమిచ్చింది. వారి ప్రయత్నం ఊరికి అరుదైన గౌరవం దక్కేలా చేసింది. వారెవరో, ఏం చేశారంటే..

మార్పు తెచ్చారు

తమిళనాడు రాష్ట్రంలోని మధురైకి 15 కి.మీ దూరంలో అచ్చంపట్టి అనే ఓ గ్రామం ఉంది. అక్కడి ప్రజల సమిష్టి కృషి ఫలితంగా 2015 అక్టోబర్ 2న ఆ గ్రామం బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా (ఓ.డి.యఫ్) గ్రామంగా ప్రకటించబడింది. ఈ గుర్తింపు రావటానికి నాయకత్వం వహించినది మాత్రం ఎవరో గొప్ప రాజకీయ నాయకులో, ఉత్సాహవంతులైన యువతీ యువకులో, పట్టభద్రులైన విద్యావేత్తలో కాదు. 90 ఏళ్ల వృద్ధ దంపతుల తొలి అడుగే ఓ గ్రామాన్ని ఆలోచింపజేసి ఆచరింపజేసింది. ఆ దంపతులే అలగు అంబళం, అంగమ్మాళ్.

వృద్ధాప్యంలో అండగా ఉండాల్సిన ఇద్దరు కొడుకులూ నిర్దాక్షిణ్యంగా వదిలేస్తే ఓ చిన్ని గదిలో నాలుగు మేకల్ని పెంచుతూ వారు జీవనం సాగిస్తున్నారు. వృద్ధ దంపతులకు సొంత భూమి అంటూ ఏమీ లేదు. అంగమ్మాళ్‌కు మంజూరైన వృద్ధాప్య పెన్షన్, పౌర సరఫరా ప్రణాళికలో భాగంగా అందుతున్న ఉచిత బియ్యం, అప్పుడపుపడూ జరిగే మేకల అమ్మకం ద్వారా వచ్చే డబ్బుతో నెట్టుకొస్తున్నారు. ఆ గ్రామంలో పెద్దగా మరుగు దొడ్లు ఉండేవి కావు. ఎవరన్నా ఊరి చివరకు వెళ్లాల్సిందే. వృద్ధ జంటకు ఈ విషయం చాలా ఇబ్బంది పెట్టేది. ఇలా యాతన పడుతున్న అలగుకు ఓ విషయం తెలిసింది. కేంద్ర ప్రభుత్వం మరుగు దొడ్లు కట్టుకోవడానికి నిధులు ఇస్తుందని. వెంటనే పంచాయతీ పెద్దల్ని కలసి మరుగు దొడ్డికి నిధులివ్వాల్సిందిగా కోరాడు. గ్రామంలో అంతమంది జనాభా ఉంటే ఎవరూ కూడా ఇలా స్వచ్ఛందంగా ముందుకొచ్చి అడిగిన దాఖలాలు లేవు. ఇస్తామన్నా పట్టించుకునే వాళ్లు కారు. వృద్ధుల్లో వచ్చిన ఈ చైతన్యం చూసి వెంటనే నిధులు మంజూరు చేశారు. నిర్మాణంలో అలగు స్వచ్ఛందంగా పనిచేశారు. సెప్టిక్ ట్యాంక్ కోసం రెండు గుంటలను స్వయంగా తవ్వారు. తాపీ పనివారికి దంపతులు సాయపడటం చూసిన గ్రామస్తులు గొప్పగా చెప్పుకునేవారు. అంతకు ముందు రాత్రి పూట చాలా ఇబ్బందిగా ఉండేది. ఓ రకంగా చెప్పాలంటే ఈ మరుగుదొడ్డి వారికి రక్షణ కల్పించింది.

చుట్టుపక్కల ఇళ్లవారికి కూడా విషయం చెప్పి వారిని కూడా మరుగు దొడ్లను కట్టుకోవాలని చైతన్యం తెచ్చిందా జంట. ఒక్కో రోజు ఒక్కో ఇంటికి వెళ్లి అవగాహన కల్పించేవారు. పంచాయితీ ఎంత మొత్తుకున్నా వినని గ్రామస్తులు అలగు దంపతులు చెప్పిన మాటలకు మారారు. బహిరంగ మలమూత్ర విసర్జన నుంచి గ్రామానికి విముక్తి కలగటానికి మరుగుదొడ్ల నిర్మాణం దిశగా గ్రామస్థులను ఉత్తేజపరచిన ఘనత ఈ దంపతులదే. వీరి గురించి వార్తలు వెలువడటంతో ఊరిపై అధికారులే కాక గ్రామ మూలాలున్న వారి దృష్టి పడింది. జిల్లా గ్రామీణాభివృద్ధి మరుగుదొడ్లు నిర్మించుకోదలచిన వారికి 12000/- ఆర్థిక సాయం కూడా అందించింది. మధురైలోని దేవకి హాస్పిటల్ అధినేత ఇదే గ్రామానికి చెందినవాడు కావటంతో గ్రామంలోని మరుగుదొడ్లలో సోలార్ లైట్లను అమర్చేందుకు, పేదవారి కోసం మరుగుదొడ్ల నిర్మాణానికి అయ్యే ఖర్చు భరించటానికి ముందుకొచ్చారు. మొత్తం 373 ఇళ్లున్న గ్రామంలో 369 ఇళ్లకు నేడు మరుగుదొడ్లు ఉన్నాయి. మిగిలిన వారు పబ్లిక్ టాయిలెట్లు ఉపయోగిచుకొంటున్నారు. 148 కుటుంబాలు సోలార్ లైట్లు అమర్చుకున్నాయి.

అక్కడితో ఆగలేదు

గ్రామ ప్రజలు ఓ బృందంగా ఏర్పడి పక్క గ్రామాల వారు తమ గ్రామ సరిహద్దులో మలమూత్ర విసర్జనకు రాకుండా అడ్డుకొనేవారు. ఉదయం నాలుగు గంటల ప్రాంతం నుండి ఎవరిని రానివ్వకుండా కాపలా కాసేవారు. అలా పక్క గ్రామాలవారు కూడా మరుగుదొడ్లు నిర్మించుకునేలా వత్తిడి తెచ్చారు. ఇప్పుడు చుట్టు పక్కల గ్రామాలు అచ్చంపట్టి బాటలో నడుస్తున్నాయి. ఓ ఒంటరి వృద్ధ జంట చేసిన చిన్న ప్రయత్నం ఇంత మార్పు తెస్తుందని ఎవరూ ఊహించలేదు.

- సింహాద్రి నాగశిరీష

12 నెలలు దేశాలు సవాళ్లు

కొత్త సంవత్సరంలో అవి చేయకూడదు.... ఇవి మానుకోవాలి.. ఇలా ఉండాలి అంటూ ఒక్కొక్కరూ ఒక్కో నిర్ణయాన్ని తీసుకుంటారు. కొందరు వాటిని అమలు చేయడానికి ప్రయత్నిస్తే మరి కొందరు తీసుకున్న నిర్ణయాలు కాగితాలకే పరిమితం చేస్తారు. సచిన్ మాత్రం అనుకున్నది సాధించాలనే గట్టి పట్టుదలతో ఉన్నాడు. '12 నెలలు, 12 దేశాలు, 12 సవాళ్లు' ఇది ముంబయికి చెందిన సచిన్ బండారి చేసుకున్న న్యూ ఇయర్ రిజల్యూషన్. ఇప్పుడతనో బ్యాక్ ప్యాకర్... కాదు కాదు అతనో మౌంటెనీర్.... అంతకు మించి అతనో స్క్యూబా డైవర్. అందరిలా తన ప్రతిభను ప్రపంచానికి తెలియజేసేందుకు కాకుండా కొత్త విషయాలను తెలుసుకునేందుకు ఒక్కో నెలలో ఒక్కో వినూత్నాంశంతో ముందుకెళుతున్నాడు.

మౌంటెనీరింగ్, ట్రెకింగ్, స్క్యూబా డైవింగ్ ఇలాంటివన్నీ సాహస యాత్రలపై మనసు పారేసుకునే యువతను ఒక నిమిషమూ స్థిరంగా నిలబడనీవు. వాటివైపు వెర్రిగా పరుగులు పెట్టించేస్తాయి మనసును. మైళ్ల దూరాలు దాటేస్తూ తమ రికార్డులతో గుర్తింపు తెచ్చుకోవడమంటే అదో సరదా కాదు వారు బతికున్నామనే భావన కలిగించే ఆక్సిజన్. డేర్‌డెవిల్స్‌ను చూస్తే వెర్రివాళ్లలా తోచినా కొందరు అలా ఉంటేనే, తిరుగుతుంటేనే జీవిస్తామన్న దానికి అర్థమని గట్టిగా నమ్ముతారు ఫాలో అయిపోతారు. సచిన్ బండారి దీనికి అదనంగా మరో అంశాన్ని జోడించాడు. చేరుకునే ప్రతి ప్రదేశంలో ఏదో ఒకటి నేర్చుకోవడం తనకిష్టం. ఆ ఇష్టమే అతన్ని బ్యాక్‌ప్యాకర్‌ని చేసింది. బ్యాక్‌ప్యాకర్‌గా తన అనుభంతో కొత్త దేశాల్లో అడుగుపెడుతూ తనకి అస్సలు పరిచయంలేని వింత అనుభవాలతో ముందుకెళుతున్నాడు. చదువుకునే రోజుల్లో ఓ ప్రాజెక్ట్‌లో భాగంగా చెన్నయ్‌లోని ఫార్ములా రేసు కార్ల పిట్ స్టాప్‌లో అడుగు పెట్టాడు. రేసు కార్లతో ఆ ప్రదేశమంతా వేగంగా దూసుకుపోతుంటుంది. సంస్కృతి సంప్రదాయాలకు ఆనవాలమైన చెన్నయ్‌లో మార్పులు కూడా అంతే వేగంగా జరిగిపోతుండడం గమినించాడు సచిన్. అందుకు కారణాలు వెలికితీసే ప్రయత్నంలో అతనో బ్యాక్‌ప్యాకర్‌గా మారాడు. ఒంటరిగా 15 రోజుల పాటు మధురై, తంజావూర్, కరైకూడి, పుదుచెరి వంటి ప్రాంతాల్ని చుట్టబెట్టాడు. కర్నాటక సంగీతం, చెట్టినాడు రుచులు, వేషధారణలో మార్పులు అతన్ని ఎంతగానో ఆకట్టుకున్నాయి. చెన్నై నగరంపై మనసు పారేసుకున్న సచిన్‌కి ప్రపంచాన్ని చుట్టిరావాలనే అలోచన కూడా అప్పుడే తట్టింది. అయితే వినోదం కోసం కాకుండా వివిధ విషయాలపై అవగాహన పెంచుకునేందుకు '12 నెలలు, 12 దేశాలు, 12 సవాళ్లతో తన ప్రయాణానికి శ్రీకారం చుట్టాడు సచిన్. తను పుట్టి పెరిగింది మహారాష్ట్రలోని పూనేలో అయినా ముంబయిలో పబ్లిక్ రిలేషన్స్ (మానవ సంబంధాలు) ప్రొఫెషనల్‌గా స్థిరపడ్డాడు. మంచి ఉద్యోగం వేలల్లో జీతం. జీవితంలో స్థిరపడుతున్న ఆ సమయంలోనే ప్రపంచంలో వేగంగా జరుగుతున్న మార్పుల్నీ తెలుసుకోవాలనిపించిందతనికి. అన్నీ వదులుకుని ప్రపంచ యాత్రకి తన ప్లాన్ సిద్ధం చేసుకున్నాడు. యాత్ర అంటే ఎవరైనా తమకి కావాల్సిన వస్తువులు, రూట్ మ్యాప్, టూర్ ప్లాన్‌తో ముందుకు సాగుతారు. సచిన్ మాత్రం ఒక్కో ప్రదేశానికి చేరుకునే ముందు ఏదో ఒక ప్రాజెక్టుతో సిద్ధమయ్యేవాడు.

25 రోజులు.... 25 రైళ్లు

ప్రపంచయాత్రలో భాగంగా సచిన్ బండారి భారత్‌లో తను చేపట్టిన మొదటి ప్రాజెక్ట్ ఇది. రైలు మార్గంలో ఉడిపితో తన టూర్‌ని మొదలుపెట్టాడు. ఎందుకంటే తన బాల్య స్మృతులన్నీ ఆ ఊరితోనే పెనవేసుకున్నాయి. ఉడిపిలో చిన్ననాటి స్నేహితులను కలిసి ఊరి పరిస్థితులను తెలుసుకున్నాడు. తర్వాత ముంబయి నుంచి కన్యాకుమారి దిశగా ట్రెయిన్ జర్నీ మొదలయ్యింది. అక్కడి నుంచి అస్సాంలోని లిడో ప్రాంతానికి చేరుకున్నాడు సచిన్. ఉత్తర భారత్ దిశగా సాగే రైలు ప్రయాణంలో చిట్టచివరి స్టేషన్ బారాముల్లా. జీలం నదీ తీరంలోని బారాముల్లాలో వింత గొలిపే ప్రదేశాలన్నీ

చుట్టొచ్చాడు. రైలు ప్రయాణీకుల ద్వారా వారి జీవన విధానాలను తెలుసుకున్నాడు. నదీతీరాలని అపరిశుభ్రం చేస్తున్న అంశాలతో పాటు ట్రెయిన్ ప్యాంట్రీల్లో అందించే నాణ్యత లోపించిన ఆహారం, రైళ్లలో అరకొర సౌకర్యాలు, వేలాది మందితో కిక్కిరిసిన రైలు ప్రయాణాలు, అతన్ని కలచివేశాయి. వీటిపై అక్కడి అధికారులకు ఫిర్యాదు చేయడంతోపాటు సమస్యలపై ఎలా పోరాడాలనే విషయాలపై అవగాహన సదస్సుల్ని నిర్వహించేవాడు సచిన్ బండారి. భారతదేశ శిఖరాగ్రంలో ఉన్న ఓఖా నుండి ముంబయికి చేరుకునే సమయంలో సాధారణ బోగీల్లో ప్రయాణించడంతో ప్రయాణీకులు ఎలాంటి ఇక్కట్లని ఎదుర్కొంటున్నారో తెలిసొచ్చిందతనికి. తక్కువ ఖర్చుతో సాగిన తన రైలు ప్రయాణానికి సచిన్ ఖర్చుచేసింది 3200 రూపాయలు.

తమిళ-సింహళ స్నేహం

తమిళుల సంస్కృతీ సంప్రదాయాలు, అక్కడ అందమైన ప్రదేశాలు, కార్ రేస్‌లు బండారీకి పరిచయం లేని విషయాలేం కాదు. తమిళులకి శ్రీలంకకి చెందిన సింహళులకి మధ్య ఏళ్లతరబడి కొనసాగుతున్న వివాదాలే అక్కడ చర్చనీయాంశాలు. వాటి మూలాల్ని తెలుసుకోవడమే తన రెండో ప్రాజెక్ట్. అందుకోసం శ్రీలంక చేరుకున్నాడు సచిన్ బండారి. తమ దేశ సముద్రతీరాల్లోకి చొరబడ్డారంటూ నిత్యం మత్స్య





కారులపై ఇరుదేశాల్లో చట్టపరమైన చర్యలు చోటు చేసుకుంటాయి. నిరంతరం వివాదాలే కాదు వారి మధ్య స్నేహ సంబంధాలూ ఉన్నాయి. అలాంటి గాథలన్నిటినీ వెలుగులోకి తెచ్చి ఇరుదేశాల మధ్యా మైత్రీ భావన్ని పెంచేందుకు ప్రయత్నించాడు బండారి.

పర్వతారోహణ అంటే తనకి ఎంతో ఇష్టం. వాటిని నేర్చుకునేందుకు థాయిలాండ్‌ను ఎంచుకున్నాడు. తక్కువ ఖర్చుతో సాగే సామాన్య జీవనంతో పాటు సాహసోపేతమైన విద్యల్లో తర్ఫీదు పొందే అవకాశం ఉండడమే అందుకు కారణం. పర్వతారోహణలో పట్టుసాధించడంతో పాటు తన రంగంలో ఒడిదొడుకులను, అవరోధాలని అధిగమించడం కూడా నేర్చుకోగలిగానంటాడు సచిన్. ఇది తన నాలుగో ప్రాజెక్ట్. థాయిల్యాండ్ నుండి తన ప్రయాణం బ్రెజిల్ దిశగా సాగింది. మనదేశంలో ఊరేగింపులు, ఉత్సవాల సమయంలో వాయించే డప్పు శబ్దాలని పోలుంటాయి బహియా బృందాలు ఉపయోగించే బట్టుకాడ వాయిద్యాలు బహియ బ్రెజిల్‌లోని ఓ కుగ్రామం. బట్టుకాడా వాయిద్యాన్ని నేర్చుకోడానికి సచిన్ అక్కడ కొన్ని రోజులు బసచేశాడు. చిన్నతనం నుంచి నీళ్లంటే భయమెక్కువ. అందుకోసం నీళ్లకి చాలా దూరంగా ఉన్నా ఇప్పుడా భయాన్ని పోగొట్టుకునేందుకు ఆఫ్రికాలోని చిలీ దేశంలో వాలిపోయాడు బండారి. అక్కడి దీవుల్లో ఈత కొట్టడంతోపాటు ఏకంగా సర్ఫింగ్‌కి సయ్యనే రీతిలో శిక్షణ తీసుకున్నాడు. దక్షిణ అమెరికాలోని పెరూతోబాటుగా బొలీవియా, చిలీ ప్రాంతాలు ట్రెకింగ్ ప్రేమికులకి ఆలంబనగా నిలుస్తున్న దేశాలు. అక్కడ నివసించే క్వెచువాస్‌లో ఏళ్ల తరబడి ఏ మార్పూ జరగకపోవడాన్ని గమనించాడు సచిన్. చిలీలోని అరికా నుండి మాచు పిచ్చూ ప్రాంతం వరకు సుమారు 600 కి.మీ కాలినడకన ప్రయాణం కొనసాగించాడు.

మెక్సికో రుచులు

భారతీయుల మాదిరి మెక్సికో వాసులు కూడా భోజన ప్రియులే. అందుకే అక్కడ కూడా రుచుల సాంప్రదాయం కనిపిస్తుంది. వివిధ దేశాలకు సంబంధించిన రుచుల సమ్మేళనంతో పాటు అక్కడి స్థానిక రుచులైన నాఛోస్, టాకోస్, టెక్స్-మెక్స్‌లని రుచికరంగా అందించడం నేర్చుకున్నాడు సచిన్ బండారి. కోస్టారికాలో స్క్యూబా డైవింగ్, హవానాలో సాల్సానృత్యాలు, న్యూ ఓర్లిన్స్‌లో వినోదాన్ని పంచే ప్రదర్శనలు, స్టాండింగ్ కమెడియన్‌గా న్యూయార్క్ వీధుల్లో మిమిక్రీలు, ఇలా ఒక్కో ప్రాజెక్టునీ ఒక్కో ప్రదేశంలో

పూర్తిచేసుకోడానికి మంచి ప్లానింగ్‌తో సిద్ధమయ్యాడు సచిన్ బండారి. ముంబయి నుంచి గోవా వరకు 12 రోజుల్లో తను పూర్తి చేసిన సైకిల్ యాత్ర తక్కువ ఖర్చుతో యాత్రచేసే అనుభవాన్నిచ్చింది. రూ.3200తో ఈ సైకిల్ యాత్రని పూర్తిచేసిన సచిన్ బండారి తన ప్రపంచ టూర్ ద్వారా అమెరికాలో 2000కి.మీ సైకిల్ యాత్రని చేసేందుకు సిద్ధమయ్యాడు. టూర్లన్నిటికీ తనకి ప్రేరణనిచ్చింది అమ్మే. అమ్మతో పాటు యూరప్‌ని చుట్టొచ్చిన ఈ బ్యాక్ ప్యాకర్ ప్రస్తుత ప్రాజెక్ట్ పూర్తవగానే తల్లితో కలిసి మరో కొత్త యాత్రను ప్రారంభించాలనుకుంటున్నాడు.

బండారి ప్రపంచ యాత్ర మొదలు పెట్టింది తను సంపాదించిన 8లక్షలతోనే. అయితే ఈ యాత్ర కొనసాగించేందుకు తనకు కొందరు స్పాన్సర్లతోపాటు కొన్ని ఎన్‌జీవో సంస్థలూ సాయపడ్డాయి. ప్రపంచ యాత్రల ద్వారా కొత్త విషయాల్ని నేర్చుకోవాలనుకునే వారికోసం 'ఆడ్ ట్రావెలర్ కమ్యూనిటీ'ని ప్రారంభించాడు బండారి. వివిధ దేశాల్ని చుట్టొచ్చిన వారి అనుభవాలతో పాటు యాత్రలు చేయాలనుకునే వారికి ఆర్థికసాయాన్ని అందించే దిశగా సభ్యులు కృషిచేస్తున్నారు. తక్కువ ఖర్చుతో ప్రపంచయాత్రను ఎలా చేయాలో ప్రపంచానికి తెలిపేందుకు తనో రచయితగా మారనున్నాడు.

- అద్దేపల్లి శర్వాణి

సామాజిక వైవిధ్యానికి ప్రతిబింబం

ఎవరిదీ ముఖం
రచయిత: రెడ్డి రామకృష్ణ
వెల: 80/-
ప్రతులకు: విశాలాంధ్ర బుక్‌హౌస్, హైదరాబాద్

ఉత్తరాంధ్ర జీవన స్థితిగతుల్ని ఉద్యమ స్వరాన్ని తనదైన శైలిలో వినిపిస్తున్న ఇతను ఇంత వరకు గొడిముక్కు, పినలకర్ర, భూమి- సముద్రం వంటి కావ్యాలను రచించారు. ఎవరిదీ ముఖం అనే కవితా సంకలనాన్ని వెలువరించారు. ఇందులోని కవితలన్నీ వర్తమాన సమాజాన్ని ప్రతిబింబించడమే గాకుండా పాఠకుడ్ని ఆలోచింపజేసేవిగా ఉంటాయి.

సముద్రంలో ఆటలాడే కుర్రాడు అనే కవితలో ఆటపాటలతో చదువు సంధ్యలతో గడపాల్సిన వాడు సముద్రంలో చేపల వేట కోసం సాహసం చేస్తున్న పన్నెండేళ్ళ బాలుడ్ని గురించి చెప్తూ రేపటి బతుకు సముద్రాన్ని ఈదటానికి తనకు తానే తర్ఫీదు పొందుతున్న మరో ఏకలవ్యునిగా కనిపిస్తున్నాడు. అని అంటాడు కవి. కవి వర్తమానంలో జీవిస్తూ,భవిష్యత్తుకి దారి నిర్మించాలంటాడు. కవిత్వం అన్యాయం ముంగిట్లో ఎగిరే ఎర్రజెండాలా ఉండాలంటాడు కవి.

వ్యవసాయం అనుకూలించక బతుకు తెరువుకు మార్గం లేక రైతు భిక్షగాడిగా మారిన అంశాన్ని రెక్కలు ముక్కలు చేసుకొని కట్టినా మురికవాడలో నివసించే కార్మికుడి దు:స్థితిని "తేడా" కవితలో కవి చూపించాడు. కవికి కర్షకుడి పట్ల కార్మికుడి పట్ల సమ దృష్టి వున్నట్లు ఈ కవిత ద్వారా తెలుస్తుంది. కనుకనే ఈ భూగోళాన్ని మోస్తున్నది ఇద్దరే వ్యక్తులని వారిలో ఒకరు రైతు కాగా, రెండవ వ్యక్తి కార్మికుడుని అంటాడు. ఇంకా ఈ కవితా సంకలనంలోని స్మృతి కవితలు కూడా కలవు. ఒకటి తన మిత్రుడు 'అల' ను స్మరించుకుంటూ రాసిన అలా నువ్వెళ్లిపోయావు కవిత కాగా రెండవది అద్దేపల్లి రామ్మోహనరావు గారికి నివాళిగా రాసిన "జెండా ఎగురుతూనే ఉంటుంది" కవిత.

ఈ కవితా సంకలనంలో శైలి అంతా సంభాషణలతో కూడిన నాటకీయ శైలిలో వుంటుంది. కవితాంశాలన్నీ పాతకొత్తల మేలు కలయికగా కనబడతాయి. అంతేగాక అర్థం కాని పదాలకు ఆ కవిత చివర వివరణలు ఇవ్వడం పాఠకునికి ప్రయోజనకరంగా ఉంది. అలాగే ఈ కావ్యానికి ముందుమాటలు గాని, ఉపదేశాలు గాని విషయ సూచిక గాని లేవు. ఈ మధ్య కాలంలో ఇటువంటి కవితా సంకలనాలు రావడం అరుదుగానే భావించవచ్చు. తన ప్రాంత సంస్కృతిని పరిసరాలను ఉద్యమ స్వరాన్ని కవిత్వంలో చొప్పించిన రెడ్డి రామకృష్ణ నుండి మరింత చిక్కనైన సామాజిక కవిత్వం రావాలని ఆశిద్దాం.

- బొడ్డూరి విజయేశ్వరరావు

జనసామాన్యమే ఇతివృత్తం

రేపటి జ్ఞాపకం
రచయిత: అడిగోపుల వెంకటరత్నమ్
పేజీలు: 128/-
వెల: 100/-
ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్, విజయవాడ

కవిత్వంలో భావం ప్రధానం. భావాన్ని అనుభూతింప చేయనిది కవిత్వం కాదు. దేనిగురించి కవి చెబుతున్నాడో... ఆ భావానికి సంబంధించిన సమగ్ర దృక్పథం కవికి వుండాలి. అప్పుడే అది జనసామాన్యం అవుతుంది. అటువంటి సమగ్ర దృక్పథంతో జనసామాన్యమే ఇతివృత్తాలు తీసుకొని కవిత్వం రాస్తున్నారు.. అడిగోపుల వెంకటరత్నమ్. తెలుగు సాహిత్యంలో వచన కవిత్వం రాయడంలో ఆయన దిట్ట. వర్తమానాన్ని వస్తువుగా తీసుకొని, నడుస్తున్న సమాజంలో కన్నీరింకిన వేదనలను అక్షరాలుగా పేర్చి ఇప్పటికి 18కవితా సంపుటాలను మనకందించారు. 'రేపటి జ్ఞాపకం' పేరుతో ప్రచురించిన ఈ తాజా సంపుటి 19వది. ఈ అన్ని కవితలూ వేటికవే విభిన్నమైనవి. 128 పేజీల్లో ఈ పుస్తకంలో మొత్తం 59 కవితలున్నాయి. ఇవి ఒట్టి కవితలు కాదు... సమాజంలో ఎవరికీ పట్టని, ఎవరూ గుర్తించని అంశాన్ని తీసుకొని కవితగా మలిచిన అడిగోపుల. '.... నిలబడలేని అలసిన బాటసారి నీపై భారం మోపుతాడు/ మట్టితట్టలు చద్దిమూటలకు నీ నెత్తి వేదిక అయింది/ లక్షల వాహనాల్ని లెక్కించావు లక్షల మైళ్లు కొలిచావు/ ఎండను ఎదిరించావు వర్షాన్ని భరించావు...' అంటూ 'దేశభాషలందు తెలుగులెస్స' పేరుతో 'మైలురాయి'పై కవిత రాసి... కవితకనర్హమైనదేదీ లేదని నిరూపించారు. సుడులు తిరుగుతున్న నదిలో.. గమ్యం తప్పుతున్న పడవపై ప్రయాణిస్తున్న వారిని గమ్యం చేర్చిన సరంగు, బ్రేకులు ఫెయిలయిన బస్సును చాకచక్యంగా నడిపి.. ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చిన డ్రైవర్, గగన సీమల్లో పయనించే విమానం... ఒక్కసారిగా కుదుపులకు లోనైతే... ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకున్న ప్రయాణీకుల ఏడుపులు... కేకల నడుమ సమయస్ఫూర్తితో విమానాన్ని ఆధీనంలోకి తెచ్చే పైలట్ గురించి 'ప్రాణదాతలు' కవితలో అద్భుతంగా వర్ణిస్తూ... 'దేవతలు పుట్టరు తయారు చెయ్యబడతారు' అంటూ ఆ కవితను ముగిస్తారు రచయిత.

అలాగే 'రేపటి జ్ఞాపకం' కవితలో 'జ్ఞాపకాల ఇంద్రధనస్సును వేలాడ దీశాను' అంటాడు. పచ్చికట్టెల పొయ్యి ఊది ఊది / ఊదెడు గొట్టం కార్చిన కన్నీళ్ళు/ కష్టాల్ని యీదియీది/ అమ్మ కార్చిన కన్నీళ్లు / బొంతను నింపిన జ్ఞాపకం' అంటూ తల్లి వేదనను జ్ఞాపకం చేసుకుంటాడు. అలాగే 'రేపునేను మరణించాక/ అంటరానితనం వెంటబడి/ ఊరిదారి అనుమతించక /ఊరి బైట /దారులు కాని దారుల వెంట తిరుగుతూ / నా శవ ప్రస్థానం / నా రేపటి జ్ఞాపకం కాకూడదు' అంటూ అంటరానితనం అంతమైపోవాలనే ఆకాంక్షను ఈ కవితలో వ్యక్తం చేస్తాడు రచయిత. ఇలా ఈ పుస్తకంలోని అన్ని కవితలూ ఒక్కో అంశాన్ని ఇతివృత్తంగా తీసుకుని, దీనిపై కూడా కవిత రాయొచ్చా... అదీ ఇంత అద్భుతంగా రాయొచ్చా అని అబ్బురపడేంత భావగర్భితమైన కవితల సంపుటి ఈ 'రేపటి జ్ఞాపకం'.

- రాజాబాబు కంచర్ల

వివరం



రగులుతోన్న దీవి

దాదాపు 572 దీవుల సమాహారంగా ఉన్న అండమాన్ దీవుల్లో ఎత్తైన పర్వతాలు, అలల అలజడులు, పచ్చని ప్రకృతి అందాలతోపాటు మనిషిని గగుర్పాటుకు గురిచేసే ఒక దీవి కూడా ఉంది. నిత్యం జ్వలించే లావాతో ఉన్న అగ్నిపర్వత దీవే బారెన్ ఐల్యాండ్. దేశంలో క్రియాశీలకంగా ఉన్న ఒకే ఒక అగ్ని పర్వతమిది.

అండమాన్ నికోబార్ దీవుల రాజధాని పోర్ట్‌బ్లెయిర్‌కు ఈశాన్యంగా 135 కి.మీ. దూరంలో బ్యారెన్ దీవి ఉంది. బారెన్ అంటే విడిచిపెట్టిన అని అర్థం వస్తుంది. ఆ దీవిలో ఎప్పుడు ఎక్కడ నుంచి వేడి నెగళ్లు ఎగుస్తాయో తెలీదు. గంధకం వాయువులో నిండి ఊపిరి పీల్చడానికి కష్టమవుతుంది. చెట్లు, పుట్ట మాడిపోయి ఆ దీవంతా కూడా బూడిద రంగులో కనిపిస్తుంది. అలా ఆదిమ తెగలే కాకుండా జీవ జాలం కూడా విడిచిపెట్టేయడంతో దానికాపేరు వచ్చింది. బారెన్ ద్వీపం భారత్-బర్మన్ టెక్టోనిక్ ఫలకంపై అగ్ని పర్వత బెల్ట్ మధ్యన ఏర్పడింది. పేరుకు తగ్గట్టుగానే ఈ దీవి నిర్మానుష్యంగా ఉంటుంది. కొన్ని రకాల వన్య జీవులు మాత్రం సంచరిస్తుండేవి. బారెన్ దీవుల్లో ఉండే అరుదైన అడవి మేక జాతి పెరెల్. ఎన్నో ఏళ్ల క్రితం నౌకా ప్రయాణాల్లో భాగంగా కొందరు నావికులు వీటిని ఇక్కడ వదిలారనే ప్రచారం ఉంది. అప్పటి నుండి పెరెల్ జాతి మేకలు అక్కడి సముద్రపు నీటిని తాగి అక్కడ జీవనానికి



అలవాటు పడ్డాయి. ఈ దీవుల్లో కొన్ని రకాల పక్షులతో పాటు (ఫ్లయింగ్ ఫాక్స్) గబ్బిలాలు ఎక్కువగా కనిపిస్తాయి. అయితే ఇక్కడ ఎక్కువగా చోటుచేసుకునే విస్ఫోటనాలతో అరుదైన వన్యప్రాణులతోపాటు వందలాది సముద్ర జీవులూ కనుమరుగవుతున్నాయి. దక్షిణ ఆసియాలో 3162.277 మీటర్ల విస్తీర్ణంలో ఉన్న అండమాన్ దీవుల్లో బారెన్ దీవి వ్యాపించింది 2 కి.మీ మాత్రమే. ఈ దీవి నిర్జీవంగా మారడానికి అక్కడ అధికంగా జరిగే అగ్నిపర్వతాల పేలుళ్లే ప్రధాన కారణం. ఈ దీవిని పర్యవేక్షించేందుకు కొందరు కోస్ట్ గార్డులు, నావికా దళాల బోట్లు మాత్రమే ఇక్కడ గస్తీ తిరుగుతుంటాయి. బారెన్ దీవిలో 1787లో మొదటి విస్ఫోటనం జరిగినట్లు చరిత్రకారులు చెబుతారు. దక్షిణ ఆసియా ఖండంలో నిరంతరం రగులుతుండే అగ్ని పర్వతంగా ఇది గుర్తించబడింది.

సందర్శించొచ్చు

భారత్‌తో పాటు థాయ్‌ల్యాండ్, మయన్మార్, ఇండోనేషియా వంటి దేశాలకు బారెన్ దీవి అతి సమీపంగా ఉండడంతో విస్ఫోటనాలు లేని సమయంలో ఇక్కడ స్క్యూబా డైవింగ్ కోసం వచ్చే సాహసికులతోపాటు వేలాదిమంది పర్యాటకులతో కళకళలాడుతుంది. డైవింగ్‌కి అనువైన ప్రదేశంగా కూడా ఈ దీవి పేరుగడించింది. అయితే ఇక్కడ విస్ఫోటనం ఎప్పుడు జరుగుతుందో మాత్రం ఎవరూ ఊహించలేరు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-బాంబేకి చెందిన ఒక శాస్త్రవేత్తల బృందం అహ్మదాబాద్‌లోని భౌతిక పరిశోధన శాలలో నిర్వహించిన పరిశోధనల ఆధారంగా సుమారు కోటీ ఎనభై లక్షల ఏళ్ల క్రితం బారెన్ దీవి ఏర్పడినట్లు తేల్చారు. 1787 నుండి 1789, 1795లో ఇక్కడ విస్ఫోటనాలు చోటుచేసుకున్నా 1803లో జరిగిన విస్ఫోటనంలో ఉవ్వెత్తున ఎగసిపడిన లావాతో ఆ ప్రాంతమంతా కకావికలమైంది. తర్వాత ఈ దీవుల్లో 1989లో సంభవించిన ఒక భారీ విస్ఫోటనం దాదాపు ఏడాదిన్నర పాటు కొనసాగడంతో బారెన్ దీవి సమీప దీవుల్లో నివసించే జనావాసాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. భూకంపాలు ఎక్కువగా చోటుచేసుకునే తీరప్రాంతానికి అతి సమీపంగా ఉండటమే బారెన్ దీవిలో నిరంతర విస్ఫోటనాలకి కారణంగా శాస్త్రవేత్తలు గుర్తించారు. బారెన్ దీవిలో కనిపించే అగ్ని పర్వతాల ఆనవాళ్లు హిందుమహా సముద్రంలో ఇప్పటికీ కనిపిస్తాయి. ఈ దీవుల వద్ద ఉన్న అగ్ని పర్వతాల్లో 1994-2005 మధ్యకాలంలో రెండు అగ్ని పర్వతాలు పేలడం హిందూ మహాసముద్రంలో సునామీకి కారణాలుగా చెబుతారు. సాధారణంగా అగ్నిపర్వతాల విస్ఫోటనం సమయంలో లావా పెద్ద ఎత్తున ద్రవ రూపంలో బైటికొస్తుంది. అయితే ఈ దీవిలో ఏర్పడే విస్ఫోటనాల్లో లావాతోపాటు నిప్పు రవ్వల్ని విరజిమ్ముతుంటాయి. 30 సెకండ్లకోసారి పెద్ద పెద్ద శబ్దాలతో లావా పేలుతూ 200 మీటర్ల ఎత్తుకు ఎగసిపడుతూ విపరీతమైన పొగని వ్యాపింపచేస్తాయి. 1994 డిసెంబర్4న భారతీయ నావికాదళం భూగర్భ శాస్త్రవేత్తల బృందంతో కలిసి 'స్ట్రంబోలియన్' విస్ఫోటనాన్ని కనుగొంది. విస్ఫోటనం ద్వారా అగ్ని పర్వతాల పార్శ్వాలు, కొండచరియలు విరిగి పడడం ద్వారా ఉప సముద్రాల్లోని సముద్రజీవాలకి తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

భూమిపై రాక్షస బల్లులు తిరిగిన కాలంలో ఏడాదికి 370 రోజులుండేవి. రోజుకు 23 గంటలే ఉండేవి. భూ పరిభ్రమణ వేగం తగ్గుతూ రావడమే దీనికి కారణం.

వయసు పెరుగుతున్న కొద్దీ కాలం వేగంగా కదిలిపోతున్నట్టు అనిపించడానికి కారణం 'ఆడ్‌బాల్ ఎఫెక్ట్'. కొత్త విషయాలు తక్కువ తెలుసుకోవడం వల్ల పాత విషయాలు తెలీకుండానే గమనికలోకి లేకుండా పోతాయి.

రోజుకు 23 గంటల 56 నిమిషాల 4.2 సెకన్లు మాత్రమే. 24 గంటలనేది వ్యావహారికం కోసమే.

మనకు తెలిసినంత వరకు అత్యంత తక్కువ కాలం ప్లాంక్ టైమ్. రెప్పపాటు కాలంతో దీన్ని కొలవాలంటే ఐదు వందల యాభై వేల ట్రిలియన్ ట్రిలియన్ ట్రిలియన్ ప్లాంక్ టైమ్స్ కావాలి.



కాల ప్రవాహంలో....

అగాధంలో కన్నా ఆకాశంలో కాలం త్వరగా జరిగిపోతున్నట్టు అనిపిస్తుంది. ఎందుకంటే కాలం గురుత్వాకర్షణ శక్తి ప్రభావానికి లోనవుతుంది. అందుకే వ్యోమగాములు భూమ్మీద కంటే కొంచెం తక్కువ వయస్సు చేస్తారు అంతరిక్షంలో.

కొలరాడోలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్టాండర్డ్స్ అండ్ టెక్నాలజీ వద్ద అతి కచ్చితత్వంతో కూడిన గడియారం ఉంది. 100 కోట్ల ఏళ్లకు ఓ క్షణాన్ని మాత్రమే అది కోల్పోతుంది.





అంతరిక్ష భౌతిక శాస్త్రవేత్త కార్ల్ సాగన్ విశ్వ కాలప్రవాహాన్ని మొత్తం 1 ఏడాదికి కుదిస్తే ఎప్పుడు ఏ పరిణామం జరిగిందనే వివరణనిచ్చాడు. అందులో బిగ్‌బ్యాంగ్ తొలి క్షణంలో జరిగితే రాక్షస బల్లులు అంతరించిన కాలం ఏడాది చివర 29 తారీఖున సంభవిస్తుంది. మనిషనేవాడు చివరి రోజు అర్ధరాత్రి 11:54కు కనిపిస్తాడు, చివరి క్షణానికి ముందు క్రిస్టోఫర్ కొలంబస్ అట్లాంటిక్‌లో యాత్ర మొదలెడతాడు. అంటే మనం భూమ్మీదకు వచ్చిన కాలం చాలా చాలా చాలా అల్పమని.

మనం 1.2 సెకన్ల క్రితం నాటి చంద్రుణ్ని, 8 నిమిషాల కిందటి సూర్యుణ్ని ఈ క్షణం చూస్తుంటాం. అంటే అక్కడి నుంచి కాంతి మన కంటికి చేరే సమయం అంత అవుతుందని అర్థం.

బిగ్‌బ్యాంగ్ వల్లే విశ్వంతో పాటు కాలమూ జనించిందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అంటే 1370 కోట్ల ఏళ్ల క్రితం నుంచే కాల ప్రవాహం కదిలిందన్నమాట.

పక్షులు..మబ్బులు.. నా గురువులు

జలపాతాల వరవడి
కొండ చరియల్ని శిల్పిస్తుంది
కొండకి కొండకి నడుమ నీటి ప్రజ్వలనం
అలకి అలకి మధ్య మెరుపులు
కొండ అంచు మీద
ఒక పక్షి ఆత్మస్థైర్యం
ఆ పక్షి మబ్బుతో మాట్లాడుతోంది
'అడవులు తరిగిపోతున్నాయి మిత్రమా!
మనుషులు స్వార్థపరులయ్యారు!
చెట్టు వేరును తెంచి ఆనందపడుతున్నారు
చెరువులు ఎండిపోతున్నాయి
నదులు శుష్కమవుతున్నాయి
జీవన భద్రత లోపించింది
జీవన ఘర్షణలో మేమున్నాము
అందుకే ఈ జలపాతంలో
నా తల తడిపి
ఆనందపడుతున్నాను'...అంది
పక్షితో మబ్బు! నిజమే సోదరీ!
మనిషి రాలేని చోటే ప్రకృతి వికసిస్తుంది
అందుకే నేనూ కొండల్ని ఆశ్రయించాను
నేను నిండు గర్భవతినై పిల్లల్ని కని
ఎన్నాళ్లైయిందో! సోదరీ!
నిత్యం గర్భస్రావాలతో నేను
తల్లడిల్లిపోతున్నాను
డాక్టర్లు పాలిపోతున్నావు
రక్తం పట్టాలంటున్నారు
చెట్టు, చీమ లేని ఎడారిగా భూమి
మారిపోతుంది
నేను నిండు శూలాలినెలా అవుతాను
చెప్పు సోదరీ! అని 'మబ్బు తన వేదనను
పక్షికి నివేదించింది
నిజమేను అక్క ఈ జలపాతం చూడు
'మృదంగ ధ్వనులతో...తప్పెట నాదాలతో
తంబుర వాద్యాలతో... కోకిల స్వరాలతో
ఎలా ధ్వనిస్తుందో..?
తెల్లవారు జామునే నేను లేచి చక్కని
స్వరంతో
ఈ జనాన్ని నిద్ర లేపుదామంటే
నా కూజితాలు వినే నాథుడే లేడు,
లేచీ లేవకముందే టీవీ మోతలు,
నా మధుర స్వరం జనారణ్యంలో
విఫలమవుతోంది!' అక్క అంది
మబ్బు పక్షి సోదరి మాటలకు
ఆశ్చర్యపోయింది
మబ్బు వెంటనే ఇలా అంది
' అవును! వ్యక్తిత్వం ఒక జీవన దర్శనం
మనలో వున్న శక్తులు ఏమైనా
అంతరించడానికి వీలు లేదు
అవి జీవన సౌరభాలు పూయాల్సిందే
నేను, సముద్ర గమనాన్ని నిర్దేశిస్తున్నాను
నదీ తరంగాల్లోని శ్రుతులకు
బాణీలు కూరుస్తున్నాను
అందుకే నేను ఆత్మస్థైర్యంతో ఉన్నాను' అంది
పక్షి సోదరి చెప్పిన జీవన సత్యాలకు
మబ్బు కరతాళ ధ్వనులు చేసింది'
' అవును సోదరీ నాది అనంతయానం
రెండు రెక్కలతో ప్రపంచం అంతా
గమిస్తాను
నాలుగు నీటి చుక్కలతో జీవం
పోసుకొంటాను
చింతాకు వంటి కళ్ళతో
నక్షత్ర మండలాల్ని వీక్షిస్తాను'
అవును! ఉత్ప్రేరణలు పరస్పర ప్రేరకాలు
పరస్పర ప్రజ్వలనాలు
నిస్తేజం, నిద్రాణత మనుషుల్లోనే
ప్రకృతి జీవుల్లో లేదు
ప్రకృతి జీవులు... ఆత్మస్థైర్య నిధులు..
ఆత్మగౌరవ ప్రతీకలు...జీవన కుసుమాలు...
అందుకే వారిలో ఆత్మహత్యలు లేవు
ఆ పక్షులు...ఆ మబ్బులు...నాకు గురువులు
ఆ మార్గంలో నేను....

డా॥ కత్తి పద్మారావు

కథ

జేబు

పాటిబండ్ల రజని

"అంజానపురం....ఎవరండీ అంజనాపురం!" కండక్టర్ అరుపుతో ఉలిక్కిపడి, నా పరధ్యానానికి వింతగా చూస్తున్న ప్రయాణికుల్ని గమనించనట్లే సూట్ కేస్ అందుకుని గబగబా బస్ దిగేశాను.

బస్ రేపిన దుమ్ము తెరల ఎర్రమట్టి రంగూ, రోడ్డు వారగా ఉన్న పెసరకళ్ళాల నుంచి వస్తున్న దువ్వా కలిసి వాతావరణం వింత రంగు పులుముకుంది.

"దెసరా సెలవలైపోయినట్టుండై, పంతులమ్మ గారొచ్చేసినారు." గట్టుపక్కగా వినపడుతున్న మాటల్ని విననట్లే, గుప్పిళ్ళ నిండా ఉన్న పెసరకాయలు వదిలేసి తల్లుల చాటుగా దాక్కొంటున్న పిల్లల్ని చూడనట్లే నడుస్తున్నాను.

పొద్దు వాలేందుకింకెంతో సమయం లేకపోవటంతో దోమలు రాకుండా ఊదర పెట్టేందుకు పెసరపొట్టు పాత పంచెల్లో కట్టి నెత్తిన పెట్టుకొని,చేతిల్లో సత్తు క్యారేజీలూ, తట్టలు పట్టుకొని గుంపులు గుంపులుగా నడుస్తున్నారు. ఆడ కూలీలు. పిల్లలకు గుగ్గిళ్ళ తాయిలం పెట్టేందుకు కట్టిన పెసరగింజల మూటలు వాళ్ళ చీరచెంగులకు బరువుగా ఊగుతున్నాయి.

చేలలోంచి బస్తాలు బళ్ళకెత్తేప్పటి పొలికేకలూ, కూలిడబ్బుల కోసం గట్లమీద కూర్చున్న మగ కూలీల మాటలూ చుట్టపొగతో కలిసి లీలగా తేలివస్తున్నాయి.

"ఏం భూలక్ష్మీ, కూలి డబ్బులందినట్టున్నాయ్. మంచి హుషారు మీదున్నావ్. ఈసారైనా మీ కోటికి స్కూలు బట్టలు కుట్టిస్తావా?" కాలిబాట పక్కగా ఉన్న చేలోంచి ఒక్క గెంతులో నన్ను కలుసుకున్న భూలక్ష్మితో అన్నాను నవ్వుతూ.

"కూల్డబ్బులంటే జీతం డబ్బులూ ఏంది పంతులమ్మా, సంతకం బెట్టినోళ్ళ చేతికీటానికి." పచ్చి పెసరకాయ చివర కొరికి. గింజల్ని లాగి నములుతూనే మాట్లాడుతుంది భూలక్ష్మి. "పొద్దూకులూ పనిజేసేది మేవు. తీరా పొద్దూకే పొలికి ఆడోళ్ళు బేగీ ఇళ్ళకెల్లండి, బేగీ ఇళ్ళకెల్లండని దయదలచినట్టే తల్చి కూలి కాస్తా మొగోళ్ళ చేతుల్ల బోస్తరు ఆ మేస్త్రీ సచ్చినోళ్ళు." నిరాశ కూడా అలవాటైపోయిన స్వరంతో చెప్పింది భూలక్ష్మి.

అప్రయత్నంగానే కృష్ణ గుర్తొచ్చాడు నాకు! భార్యల కూలి డబ్బుల కోసం ఆశపడే ఈ కూలీలకూ, నా జీతం కోసం ఎదురుచూసే ఆ విద్యార్థికుడికీ తేడా ఏమిటి? ఇన్నాళ్ళ నుంచీ లేని కొత్త విరక్తి లాంటి భావమేదో కదిలింది నాలో.

ఇంతలో ముందు నడుస్తున్న శేషమ్మ ఒకడుగు వెనక్కువేసి మాతో కలిసింది. ఆ మా తల్లి జోబీ రవణమ్మ గారొక్కతి! ఆడోళ్ళ కూల్డబ్బులు ఆడోళ్ళ చేతల బెట్టాల్రా అని మేస్త్రీల్ని గసిరేది. అట్టాంటి మాతల్లిని దేవుడు సల్లంగ జూడకపాయె." తనలో తాను అనుకున్నట్టుగానే అన్నా, సెలవుల తరువాత వస్తున్న నాకు కొత్త విషయమేదో చెప్పాలనే ఆత్రుత ధ్వనించింది శేషమ్మ గొంతులో.

"ఏం? ఏమైంది రమణమ్మగార్కి?" కంగారుగా అడిగాన్నేను.

"రాయల్లే దిరిగే మనిషి మంచం బట్టిందమ్మ. బైటికి జెప్పట్లేదుగానీ, తల్లీ కొడుకులూ తగువుబడ్డారనీ,ఆ తోపులాటలో కిందబడిందనీ..." పూర్తిగా చెప్పకుండానే మాట సగంలో మింగేసింది శేషమ్మ.

చేతిలోని సూట్ కేస్ పదిరెట్లు బరువెక్కినట్టు తోచింది నాకా వార్త వినగానే. ఈ పల్లెలోని వాళ్ళందరిలోకి రమణమ్మ గారే ఆత్మీయురాలు నాకు. వాళ్ళింటిలోని గదిలోనే నేనుండేది కూడా. "జేబీ రమణయమ్మ" అంటే జె.బి. రమణమ్మ కాబోలనుకున్నా నా పొడక్షరాల ఇంగ్లీషు జ్ఞానంతో, జేబీ అంటే "జేబు" కి వ్యవహార రూపమని తరువాతర్వాత గానీ అర్థం కాలేదు. పల్లెల్లో హాస్యానికో, అలవాట్లనుబట్టో ఇలాంటి మారు పేర్లు ఉన్నా. ఆవిడకాపేరెందుకు పెట్టారో తెలియలేదు నాకు. కొంత చనువు పెరిగాక ఆవిడనే అడిగాను ఆ సంగతి.

ముసి ముసిగా నవ్విందావిడ. "అమ్మాయ్, నీ చిన్నప్పుడు మీ అమ్మానాన్నతో కలిసి ఎక్కడికైనా వెళ్ళావా?" అంది.

"ఆ వెళ్ళాను" అన్నాను ఆశ్చర్యంగా.

"ఆ దారిలో నీకేమైనా కొనిపెట్టాలంటే ఎవర్నడిగేదానివి?"

" మా అమ్మని."

"మరి మీ అమ్మ కొనిపెట్టేదా?"

" మానాన్నని అడగమనేది."

"ఎందుకని?"

" మా నాన్నేగా డబ్బులిచ్చేది- అందుకని." ఒకటో తరగతి పిల్లలా నా చేత సమాధానం వెంట సమాధానం చెప్పించిన తర్వాత అందామె! " నా చిన్నపట్నుంచి నీ చిన్నప్పటి దాకా నాన్నల దగ్గర డబ్బులుండటానికీ, అమ్మల దగ్గర డబ్బులు

లేకపోవటానికీ కారణ జేబే అనుకొని మా అమ్మను కూడా జేబు కుట్టించుకోమని పేచీ పెట్టేదాన్ని. చివరికో రోజు మిషను దగ్గరకు వెళ్ళి మా అమ్మ చెప్పిందని నమ్మకంగా చెప్పి, మా అమ్మ జాకీటుకు జేబు కుట్టించుకు వచ్చి మా అమ్మ చేత తన్నులు తిన్నాను. నేనెంత మొత్తుకున్నా మా అమ్మ జేబు ఉంచుకోలేదు కానీ నా పేరు మాత్రం ఆ రోజునుంచీ జేబీ రమణమ్మైపోయింది" నవ్వుతూనే చెబుతున్నా ఏదో తెలియని విషాదం పలికిందామె మాటల్లో.

ఆ విషాదానికి కారణం తర్వాత్తర్వాతగానీ అర్థం కాలేదు నాకు.స్వతహాగా రమణమ్మ గారు అభిమానవతి. కానీ ఆమె భర్త పిసినారి, కోపిష్టి కూడా. అరవై ఏళ్ళు దాటిన వయసులో ఆస్మాతో బాధపడుతూ మంచంలో ఉండి కూడా ఇంట్లో అంతా తనను చూసి గడగడలాడాలనుకుంటాడు. ధాన్యపు కొట్టు తాళం దగ్గర్నుంచి చిల్లర పైసల వరకూ ఆయన తలగడ కిందనే ఉంచుకుంటాడు. ఇంట్లో ఏ ఖర్చుకి పైసలు కావాలన్నా ఆమె ఆయన్ను డబ్బు అడగటం, ఆయన్తో తిట్లు తింటూ తీసుకొని పక్కకు వచ్చి కళ్ళు తుడుచుకోవటం చాలా సార్లు చూశాన్నేను.

ఇంట్లోకి నెలకి సరిపడా వెచ్చాలు ఫస్టు తారీఖున తెచ్చుకునే అలవాటు నుంచి వచ్చిన నాకు, ఈ పల్లెలోని ఆడవాళ్ళు సరకులు కొనే విధానం గమ్మత్తుగా ఉండేది. సరకులు అవసరమైనప్పుడు ఆదరాబాదరాగా ఇంట్లో ఏ ధాన్యం ఉంటే ఆ ధాన్యం సంచీలోనో, మానికలోనో పోసుకొని కొట్టు దగ్గర ఇచ్చి కావలసిన సరుకు తెచ్చుకుంటారు వీళ్ళు. అలా ఇవ్వటం వలన వస్తువు ధర కంటే రెట్టింపు చెల్లిస్తున్నారని ఎన్నిసార్లు చెప్పినా, "ఏదైనా పండక్కు గానీ, శుభకార్యానికి గానీ మగాళ్ళు టౌనుకెళ్ళి సరుకులు తేరు, మరి ఏం చెయ్యం పంతులమ్మా" అన్న ప్రశ్నకు జవాబు దొరకదు నాకు.

పాలు పితుకుతున్న శబ్దం దూడలు అరుస్తున్న శబ్దం వినబడేవరకూ ఊళ్ళోకి ప్రవేశించింది కూడా గమనించనంతగా ఆలోచనల్లో మునిగిపోయాను. చిన్న చిన్న తపేళాలతో, క్యాన్లతో పాలు పోయడానికి వచ్చిన వాళ్ళతో పాల కేంద్రం దగ్గర సందడిగా ఉంది.

"ఈ పాలకేంద్రాలూ, కోళ్ళఫారాలు వచ్చి ఆడోళ్ళ నోళ్ళలో దుమ్ము కొట్టాయి పంతులమ్మా" అక్కసుగా రమణమ్మగారన్న మాటలు గుర్తొచ్చాయి ఆ దృశ్యం చూడగానే.

"అదేమిటి రమణమ్మగారూ, వాటివల్ల రైతులకెంతో లాభమంటుంది గదా ప్రభుత్వం." ఆశ్చర్యంగా అన్నాను నేనప్పుడు.

"పెబుత్వం చెప్పే రైతులంటే ఎవురు? మొగోళ్ళు ఆళ్ళకి లాభమే మరి! నేజెప్పేది ఆడోళ్ళ సంగతి. ఈ కేంద్రాలూ, ఫారాలూ రాకముందు గుడ్లమ్మీ కోళ్ళమ్మీ, నెయ్యమ్మీ నాలుగు డబ్బులు దాసుకుని మొగోళ్ళ ముందు చెయిజాచకుండా గుడ్డా బెడ్డా కొనుక్కునే వాళ్ళం. మరిప్పుడో? రొచ్చులో రొష్టులో పనిజేసి పాలు కేంద్రాలకి పోసేది. మేవు. పాలబిల్లు రాగానే పంచాయితీ ఆఫీసు కూడ పేరు పేరునా పిలిసి డబ్బులిచ్చేది మొగోళ్ళకి. పెబుత్వం అంట పెబుత్వం. నిజంగా పనిచేసేవాళ్ళకి డబ్బు దక్కేట్టు జేయలేంది పెబుత్వం ఎట్టా అవుద్ది?" గొణుగుతున్న ఆమెకు సమాధానం లేదు నా దగ్గర. బలహీన వర్గాల శ్రమ దోపిడీ గురించి మాట్లాడేవాళ్ళు కుటుంబాల్లో స్త్రీ శ్రమదోపిడీ గురించి ఎందుకు మాట్లాడరో అనిపించింది.నాకా క్షణాన.

రమణమ్మగారు కూడా వాళ్ళాయనలాగా పిసినారేమో అని అనుమానం వచ్చినా తమ పాలేరు పిల్లాడిని చూసే విధానం చూశాక ఆ అనుమానం కూడా తీరిపోయింది నాకు.

ఆ పిల్లాడికి అన్నం పెడుతూ, "ఒరే పిచ్చి వెధవా కడుపు నిండా తినరా, నీ జీతం మీ అయ్యకు దక్కితే, నీ చాకిరి మాకు దక్కితే, నీకు మిగిలేది ఆ తిండేరా సన్నాసీ. కడుపు నిండా తిను" అంటూ కసిరేది ఆప్యాయంగా. తమకు దక్కని ఫలితాలకు జీవితాన్ని తాకట్టు పెట్టుకున్న తనకూ, వాడికీ పోలిక కనిపించేదేమో వాడిలో ఆమెకు.

ఆవిడ శ్రమను గమనించి ఆమె వద్దన్నా బలవంతాన ఇంటి అద్దె, పాల డబ్బులూ రహస్యంగా ఆమెకే ఇచ్చేదాన్ని నేను. వద్దువద్దంటూనే అపురూపంగా అందుకునేదావిడ.

ఓ సారి డబ్బులు తీసుకుంటూ."పంతులమ్మా, ఈసారి పట్నం వెళ్ళినపుడు బంగారం రేటెట్టా ఉందో కనుక్కొస్తావ్" అంది గొంతు తగ్గించి గుసగుసగా.

"ఏవిటి కథ! తాతగారు కానీ కాసుల పేరు చేయిస్తానన్లేదు గదా."

హాస్యంగా అన్నాన్నేను.

"ఊ" అంటూ మూతి తిప్పి అందామె. "రహస్యంగా దాసుకున్న డబ్బులు కాసినుండయ్. ఎవురికీ తెలీకుండా రెండు కాసులు బంగారం తెచ్చిపెడతావేమోనని" అంటూ ఆశగా కళ్లు మెరిపించింది.

ఇన్ని నీతులు చెప్పే రమణమ్మగారు కూడా ఆ వయసులో బంగారంపై మోజు పడటంతో ఆమె మీద గౌరవం కొంచెం తగ్గినట్లయింది నాకు.

"ఈ వయసులో ఇంకా మీకు బంగారమెందుకండీ! ఏ పొలమో కొనుక్కుంటే లాభం కదా." అన్నాను కొంచెం కరుగ్గానే.

కాంతి తగ్గింది రమణమ్మగారి ముఖంలో కొంచెం సేపు మౌనంగా కూర్చుని "నువు చెప్పినట్టు పొలం కొంటే లాభమే పంతులమ్మా కానీ ఆ పొలాలు గానీ దాని మీద ఆదాయంగానీ మా ఆయనకీ, ఆయన తరువాత కొడుకులకీ చెందుతాయ్. దేవుడు చల్లగా చూసి ముందే నేనుపోయాననుకో, పేచీలేదు. కానీ మా ఆయన నాకంటే పదేళ్ళు పెద్ద. ఆయనే ముందనుకో అహ కీడెంచి మేలెంచమన్నారు కదా. మరప్పుడు నా సంగతేవిటి? కొడుకులు పెడితే తినాల లేదంటే పస్తులుండాల. అంతేనా! అదే నాకంటూ కొంత సొమ్ముందనుకో, దాని కోసమైనా ఎవురో ఒకరు చూడకపోరు. ఏవంటావ్? కలల్లో బతికి కష్టాలు తెచ్చుకోడం కంటే ముందు జాగ్రత మంచిదా, కాదా?" గంభీరంగా రమణమ్మ గారుచేసిన వాదానికి బంగారం పట్ల స్త్రీలకున్న ప్రేమలో అసలు కారణం గ్రహించక సగటు మగాడిలా మాట్లాడినందుకు సిగ్గుపడ్డాను నేనారోజు.

ఆలోచనల్లో పడి పలకరిస్తున్న వారికి పొడిపొడిగా సమాధానాలు చెబుతూ నడుస్తున్నానేగాని. ఇల్లు దగ్గరవుతున్న కొద్దీ ఎలాంటి దృశ్యం చూడాలో అని గుండె గుబగుబలాడుతోంది. ఎలాగో శక్తి కూడదీసుకుంటూ వాకిట్లోకి అడుగుపెట్టాను. దీపంలో ఒట్టేజితో వెలుగుతూ పరిసరాలపై ఏదో దిగులు తెర కప్పుతోంది. పాత దుప్పటి పరచిన నులకమంచంపై పడుకోబెట్టబడింది రమణమ్మ గారు. చిన్నగా గురకలాంటి ధ్వని వస్తోంది ఆమె నోటి నుంచి ఇరుగుపొరుగు ఆడవాళ్ళొక అరుగుమీద, రమణమ్మ గారి కొడుకూ,భర్తా మరో అరుగు మీదా కూర్చొని ఉన్నారు.

నా రాక ఏవో జ్ఞాపకాలు రేపినట్లు వెక్కిళు వినిపించాయి. కోడలు తులసి నుంచి. బాగా ఏడ్చినట్లు తులసి కనురెప్పలు వాచి ఉన్నాయి.

"హాస్పిటల్‌కి తీసుకువెళ్ళాల్సింది." నాలో నేను అనుకున్నట్లుగా పైకే అన్నాను.

కళ్ళు తుడుచుకుంటూ మామగారి వైపు నిరసనగా చూసి తలదించుకుంది తులసి.

అనవసరంగా దగ్గి ఆయాసం నటించాడాయన. "ఊళ్ళో డాక్టరు గారు లాభం లేదన్నారు." చెప్పాడు రమణమ్మ గారి కొడుకు. గుంట నక్కల్లాంటి వాళ్ళ వంక నిరసనగా చూసి చరచరా నా గది తాళం తీసి కుర్చీలో కూలబడ్డాను.

ఎవరి మీదో తెలియని కసి, దు:ఖం చిందులు తొక్కుతున్నాయి నాలో. తల పగిలిపోతోంది. టాబ్లెట్ అయినా వేసుకుందామని హ్యాండ్ బ్యాగ్ అందుకున్నాను. ఆ బ్యాగ్ ముట్టుకోగానే మళ్ళీ రమణమ్మగారు "ఏ రాత్రైతేలేమ్మా పళ్ళూడగొట్టుకొనేందుకు" అని అంటున్నట్లే అనిపించింది.

ఓ రోజు నా బ్యాగ్ చూసి, "ఇదేం సంచీ పంతులమ్మా" అందావిడ వింతగా.

"నా హ్యాండ్ బ్యాగ్ అండీ అంటే డబ్బులివీ

దాచుకునేదన్నమాట" అన్నాను వివరంగా.

"అయితే, నీ జీతం నువ్వే దాచుకుంటావా." అంది గొప్పగా చూస్తూ

"లేదండీ, నా ఖర్చులకుంచుకుని మిగతాది మా వారికిచ్చేస్తాను" అన్నాను.

ఏదో పని చేసుకుంటూ, కాసేపాగాక చూస్తే ఆమె ఇంకా ఆ బ్యాగ్ వంకే చూస్తుండటం గమనించి. "ఏం రమణమ్మగారు! మీకు ఓ బ్యాగ్ తెచ్చి పెట్టమంటారేవిటీ? మీ గుడ్డ జేబీ బదులు వాడుకుందురు". నవ్వుతూ అన్నాను.

ముఖం అదోలా పెట్టుకుని "ఏరాయైతేలేమ్మా పళ్ళూడగొట్టుకునేందుకు " అంటూ గొణుక్కుంటూ వెళ్ళిన ఆమె మాటలకర్థం ఏడాది తర్వాతగానీ తెలియలేదు నాకు.

తన ఫ్రెండెవరో చిట్ ఫండ్ కంపెనీ పెట్టాడని, నువ్వూ ఓ చిట్ కట్టాల్సిందేనంటూ మా తమ్ముడు బలవంతాన ఓ గ్రూప్‌లో చేర్పించాడు నన్ను.

కృష్ణకు చెప్పలేదని సంశయంగా ఉన్నా, దుబారా కాదుకదా అనే ధైర్యంతో కట్టాను నేను. అదే సంగతి చెప్పాను కృష్ణతో సెలవులకెళ్ళినప్పుడు మిగిలిన జీతం ఇస్తూ. ఒక్కసారిగా భగ్గుమన్నాడు కృష్ణ ఆ మాటతో! నీ ఇష్టం వచ్చినట్టు నువ్వు ఖర్చు చేస్తే మగాణ్ణి నేనున్నదెందుకంటూ నానా రభసా చేశాడు. జీవన భృతికి లోటు లేకున్నా, "కృష్ణ ఎంతటి సమర్థుడు, ఎన్ని షేర్లు కొన్నాడు. ఎంత సంపాదించాడు అనే గొప్ప కోసమే చెరొక చోట ఉండటం నాకిష్టం లేకపోయినా బలవంతాన నా చేత ఉద్యోగం చేయిస్తున్నాడు. ఇన్నాళ్ళలాగా 'ఇంత శ్రమా మా ఇద్దరి కోసమూ' అనే అందమైన ఆత్మ వంచన చేసుకునే ఆశ పటాపంచలయింది అతడి మాటల్తో.

ప్రవాస శిక్షలా అనిపించిన ఆ పది రోజులూ పూర్తవుతుండగా "నువ్వు కట్టిన చిట్‌కు సరిపడా ట్యూషన్‌లు చెప్పి కట్టుకో, జీతంలో ఏ మాత్రం తగ్గినా నేను సహించను. గుర్తుంచుకో" అంటూ ఆజ్ఞ జారీ చేసి మరో మాటకవకాశం లేకుండా వెళ్ళిపోయాడు. నా కష్టం మీద నాకు హక్కులేనప్పుడు రమణమ్మ గారికీ, నాకూ తేడా ఏమీ కనిపించకపోగా, ఆవిడ మాటలు చెర్నాకోల చురకల్లా బాధించడం మొదలెట్టాయి.

కిర్రుమన్న తలుపు శబ్దానికి కళ్ళకి అడ్డుగా ఉన్న చేయి తొలగించి చూశాను. రమణమ్మ గారి కోడలు తులసి! గ్లాసుతో మజ్జిగ టేబిల్‌పై పెట్టి అలాగే నిలబడింది. ఆమె ఏదో చెప్పాలనుకుంటున్నదని అర్థమైంది నాకు.

"ఏమైంది తులసీ" అన్నాను అనునయంగా.

వర్షం వెలిశాక చెట్టును కదిలించినట్లు జలజలా కన్నీళ్ళు రాలాయి తులసి కళ్ళనుంచి

"ఎప్పట్లానే మా ఆయనా, మా మావగారూ మా అమ్మావాళ్ళు నాకిచ్చినా పొలం అమ్ముకురమ్మని గొడవ మొదలెట్టారండీ, ఈ గోల ఎన్నాళ్ళు భరించినా పోదని అమ్మటానికి నిర్ణయించుకొని మా అత్తమ్మను సలహా అడిగానండి. అప్పటిదాకా ఎటూ మాట్లాడని అత్తమ్మ, ఓసి పిచ్చి మొహవా చేతిలోది వదులుకుంటే కాళ్ళు పట్టుకున్నా కలిసిరాదే. ఆపైన నువ్వు బికారివే' అందండి.

వసారాలో ఉండి వినే విన్నారండి మా మావగారు. రంకెలు ఎయ్యటం మొదలు పెట్టాడండీ, అప్పుడే చేలోంచి వచ్చిన మా ఆయన కొడుకు బాగుపడతుంటే చూళ్ళేవని నానా మాటలూ అని మెడబట్టుకు బయటకు తోశాడండీ, ఆ ఊపు తట్టుకోలేక అత్తమ్మ గడపకు..." మళ్ళీ దు:ఖం ముంచుకొచ్చింది తులసికి.

అప్పటికప్పుడు వెళ్ళి పోలీస్ రిపోర్టు ఇద్దామన్నంత ఆవేశం పొంగింది నాలో కానీ కాపురం చెడుతుందన్న భయంతో తులసి కూడా సాక్ష్యం ఇవ్వదు. అంటూ వివేకం వెన్ను తట్టింది. ఎవరి సంగతో సరే, నీ సంగతేమిటి? నీ జీతంపై నీకు హక్కు లేనిదానివి. ఎవరి సంగతో ఎలా అడుగుతావ్' అంటూ అంతరాత్మ నిలదీస్తోంది మరోపక్క.

ఏమీ తేల్చుకోలేని ఈ సంఘర్షణ భరించలేక నిద్రమాత్ర మింగి కళ్ళు మూసుకున్నాను. బలవంతంగా.

తెల్లగా తెల్లవారాక వీరమ్మ తలుపు తడుతుండగా మెలకువ వచ్చింది. గబగబా వాకిట్లోకి నడిచి రమణమ్మ గారి వంక చూశాను. ఆమె అదే స్థితిలో ఉంది. నిట్టూరిస్తూ నా గదిలోకి వచ్చాను.

" ఎట్టాంటి మా తల్లి ఎట్టా అయిపోయిందమ్మా" విడిచిన బట్టలు మడతపెడుతూ అంది వీరమ్మ దిగులుగా, మౌనంగా పని చూసుకుంటున్నాను నేను.

"ఊరోళ్ళ గుడ్డలన్నీ నడువు లిరిగేదాకా ఉతికేది నువ్వు కళ్ళాలకాడ జీతం గింజలు కొలుచుకొని ఆడనే అమ్ముకునేది నీ మొగుడూనా?ఓసి పిచ్చి మొకవా ఉళ్ళోవాళ్ళ నడుక్కున్న పాత కోకలు కాకపోతే, ఇస్త్రీ బట్టల డబ్బులన్నా దాసుకొని కొనుక్కోవే అని నాలుగు డబ్బులు దాసుకోటం నేర్పింది. ఈయమ్మేనమ్మా ఈయమ్మ పున్నెమా అని జోటి కోకలు కొనుక్కుంటున్నా" శ్రోతతో సంబంధం లేకుండా చెప్పి బట్టలు భుజానా వేసుకొని వెళ్ళిపోయింది వీరమ్మ.

స్పందన కోల్పోయాన్నేప్పటికే. ప్రతి స్త్రీ ఒక పగిలిన కుండలా- నింపిన పాలలో ఒక చుక్కైనా మిగుల్చుకోలేని ఓటికుండలా కనపడుతూంది నాకు.

రీ ఓపెనింగ్ డే కావటంతో తప్పనిసరై స్కూలుకి వెళ్ళాను. సంతకం చేసి ఐదవ తరగతిలో కూర్చున్నాను. పాత పాఠాలు ఓసారి చదవమని పిల్లలకి చెప్పాను.

1948 డిసెంబర్ 10 వ తేదీన ఐక్యరాజ్య సమితి మానవ ప్రకటనలోని ముఖ్యాంశాలు. ప్రపంచ పౌరులందరికీ వ్యక్తిగత, రాజకీయ, ఆర్థిక సమానతలు కల్పించటం," ఓ అబ్బాయి గట్టిగా చదువుతున్నాడు.

"ఆర్థిక సమానత!" నవ్వొచ్చింది నాకు. రమణమ్మ గారు రైతులంటే మగవాళ్ళే అన్నట్టు, ఇక్కడ పౌరులంటే కూడా మగవాళ్ళేనేమో!

ఎంత మంది మహిళలు తమ ఆర్థిక హక్కు వినియోగించుకుంటున్నారు? పరిష్కారం తేలని ఆలోచనలతోనే ఆ పూట గడిచింది. నేనింటికి వెళ్ళేసరికి గట్టిగా ఏడుపులు వినపడుతున్నాయి. ఉన్న కాస్త ఆశా అడుగంటింది నాకు. అప్పటికి పది నిమిషాలయింది రమణమ్మగారు పోయి. ఎవరెవరో ఏవిటేవిటో మాట్లాడుతున్నారు. కన్నీళ్ళు కూడా రానంతగా మొద్దుబారిపోయింది నా మనసు.

ఒక పక్క ఆమె గుణగణాలను దానధర్మాలను పొగిడేవాళ్ళు, మరో పక్క జరగాల్సిన పనులు చూస్తున్న వాళ్ళతో హడావిడిగా ఉంది ఇల్లంతా. వేరే ఊళ్ళనుంచి రావాల్సిన వాళ్ళెవరూ లేకపోవటంతో పొద్దు వాలక ముందే దహన క్రియకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

స్నానం చేయించేందుకు లేపారు ఆవిడ శరీరాన్ని. 'టప్' మని పడింది గుడ్డసంచీ, వదులైనా ఆమె చీర కుచ్చిళ్ళ నుంచి ఒళ్ళు జలదరించింది నాకు. ఆ సంచీ చూడగానే రకరకాల జ్ఞాపకాలు చుట్టుముట్టాయి.

ఆ జేబీ కూడా ఆమెతో పాటే ఉంచండి. ఆమెకదంటే పంచ ప్రాణాలు జేబీ లేకపోతే ఆ జీవుడు కట్టెనొదలనంటది" ఎవరో అన్నారు.

అంత విచారంలోనూ నవ్వొచ్చింది నాకు. నిజంగా రమణమ్మ గారు ప్రేమించింది ఆ గుడ్డసంచీనేనా?" విరక్తిగా నవ్వుకున్నాను.

బంధువులందరూ ఆమెకు కడసారి నమస్కారాలు చేస్తున్నారు. ఏ బంధుత్వమూ లేకపోయినా నేనూ ఆమెకు నమస్కరించి వెనుదిరిగి వడివడిగా నా గదిలో కొచ్చేశాను. నాకు తెలియకుండానే నా బ్యాగ్‌ను అందుకుని గుండెలకు హత్తుకున్నాను పిచ్చిగా.

ఆ తెల్లవారి నుంచే ప్రతి సాయంత్రమూ ట్యూషన్లు మొదలు పెట్టాను. కానీ నా భర్త ఆదేశించినట్లు చదువుకునే పిల్లలకు మాత్రం కాదు, తమ విలువ తాము తెలుసుకోవలసిన స్త్రీలకు.

✦

ప్రాన్స్ పాప్‌కార్న్



కావాల్సిన పదార్థాలు
రొయ్యలు- 10
అల్లం వెల్లుల్లి పేస్ట్-1 టేబుల్ స్పూన్
నిమ్మకాయలు-3
కారం-1టీ స్పూన్
కొత్తిమీర పొడి- 1టీ స్పూన్
మెంతి పొడి-1టీ స్పూన్
కొత్తిమీర తరుగు- 1/2 కప్పు
మైదా-250 గ్రాములు
గోధుమ పిండి-250 గ్రాములు
నూనె- సరిపడా
ఉప్పు- తగినంత

తయారుచేసే విధానం
ముందుగా ప్రాన్స్‌ని శుభ్రపరిచి చిన్న ముక్కలుగా కట్‌చేసి పక్కనపెట్టుకోవాలి. ఒక బౌల్‌లో అల్లం-వెల్లుల్లి పేస్ట్, కారం, కొత్తిమీర పొడి, మెంతి పొడి, ఉప్పు, నిమ్మరసం తరిగిపెట్టుకున్న రొయ్యల్ని వేసి అరగంట పాటు పక్కన ఉంచాలి. మరొక బౌల్‌లో గుడ్డు సొన వేసి బాగా మీట్ చేయాలి. మైదా, గోధుమ పిండిని వేరు వేరుగా రెండు ప్లేట్లలోకి తీసుకుని రొయ్యల ముక్కల్ని గుడ్డుసొనలో ముంచి తర్వాత పిండిలో కూడా అద్ది ఒక ప్లేట్‌లో పెట్టుకోవాలి. ఇప్పుడు స్టౌ పై బాణలి పెట్టి తగినంత నూనె వేసి వేడెక్కిన తర్వాత రొయ్యల్ని వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. ఒక ప్లేట్‌లోకి వేయించిన ప్రాన్స్ తీసుకుని కొత్తిమీర తరుగు, నిమ్మతరుగుతో గార్నిష్ చేసి వేడివేడిగా రుచి చూడండి.

ఫిష్ ఫింగర్స్

కావాల్సిన పదార్థాలు
చేపలు -1/2 కేజీ
నిమ్మకాయలు-3
వెల్లుల్లి రేకలు-4
పచ్చిమిర్చి-3
పొదీనా తరుగు- 1/4 కప్పు, కూర పొడి- 1టీ స్పూన్, వెన్న -500గ్రాములు (పొడి చేసుకోవాలి)
గుడ్లు-4
మైదా-1/2కేజి
బ్రెడ్ ముక్కలు-250 గ్రాములు, నూనె- సరిపడా
ఉప్పు- తగినంత

తయారుచేసే విధానం
ముందుగా చేపల్ని శుభ్రపరిచి పెద్ద ముక్కలుగా తరిగి పెట్టుకోవాలి. ఒక బౌల్ తీసుకుని అందులో వెల్లుల్లి రెబ్బలు, పొదీనా ఆకులు, పచ్చిమిర్చి తరుగు, కూరపొడి. నిమ్మరసం, చేపముక్కలు వేసి పక్కనపెట్టుకోవాలి. మరో బౌల్‌లో గుడ్డుసొన, బ్రెడ్ ముక్కలు, మైదా తీసుకుని బాగా కలుపుకోవాలి. అరగంట తర్వాత నిమ్మరసంలో నుండి చేపల్ని తీసి మైదా మిశ్రమంలో అద్ది గోధుమరంగు వచ్చే, వరకు నూనెలో వేయించుకోవాలి. ఇప్పుడు ఒక ప్లేట్‌లోకి వేయించిన చేపముక్కల్ని తీసి పొదీనా తరుగుతో గార్నిష్ చేసి వేడి వేడి ఫిష్ ఫింగర్స్‌ని అతిథులకి అందించండి.

ఫిష్ కేక్

కావాల్సిన పదార్థాలు
చేపలు-1/2 కేజి
వెన్న -2 టేబుల్ స్పూన్లు
ఉల్లితరుగు-3 టేబుల్ స్పూన్లు
క్రీమ్-3 టేబుల్ స్పూన్లు
బంగాళదుంపలు (ఉడకబెట్టినవి)-750 గ్రాములు
కొత్తిమీర తరుగు-2 టేబుల్ స్పూన్లు
అన్ని రకాల పిండి మిక్చర్-1 కప్పు
నూనె- తగినంత
కారం-2 టేబుల్ స్పూన్లు
ఉప్పు- సరిపడా

తయారుచేసే విధానం
ముందుగా చేపల్ని శుభ్రంచేసి చిన్న చిన్న ముక్కలుగా తరిగి చిన్న మంటపై వాటిని కాల్చి పక్కన పెట్టుకోవాలి. స్టౌ పై పాన్ పెట్టి వెన్న, ఉల్లితరుగు, క్రీమ్ వేసి 2 నిమిషాలు ఉడకనివ్వాలి. ఇప్పుడు ఉడికించి పెట్టుకున్న బంగాళాదుంపల పేస్ట్, ఉప్పు , కారం. చేప ముక్కల్ని వేసి మరికొంతసేపు ఉడకనివ్వాలి. తర్వాత పిండి మిక్చర్‌ని కూడా వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక బౌల్‌లోకి తీసుకుని పక్కనపెట్టుకోవాలి. ఇప్పుడు స్టౌపై ఒక పాత్ర ఉంచి కొద్దిగా నూనె వేసి వేడెక్కనివ్వాలి. చేపముక్కల మిశ్రమాన్ని చిన్న చిన్న కేక్స్ ఆకారంలో చేసి పిండిలో రెండు వైపులా అద్ది పక్కన పెట్టుకోవాలి. నూనె వేడెక్కిన తర్వాత ఒక్కో కేక్‌ని రెండువైపులా కాగేలా వేయించుకోవాలి. ఫిష్ కేక్స్ వేడివేడిగా తింటే రుచిగా ఉంటాయి.



ఆకుల పెంగ్విన్

మనింటి ముందు రాలి పడిపోతుండే ఎండుటాకులు, పచ్చి ఆకులతో పెంగ్విన్ బొమ్మ ఎలా చేయచ్చో ఇక్కడ ఇచ్చాం. మీరూ ప్రయత్నించండి.

ఏమిటది?

రాత్రయినా పగలయినా దీపం పట్టుకు తిరుగుతుంది. ఏమిటది?

జ: మిణుగురు పురుగు

తేడాలు గుర్తించండి

ఈ రెండు బొమ్మల్లో మొత్తం ఐదు తేడాలున్నాయి. వాటిని మీరు గుర్తించి సున్నా చుట్టేయండి.



పదాలు గుర్తించండి

సముద్రాల్లో తిరుగుతుండే కొన్ని జంతువులతోపాటు వాటి పేర్లను కూడా ఇక్కడుంచాం. పక్కనున్న అక్షరాల్లో ఆ పేర్లు ఎక్కడున్నాయో గుర్తించి పెన్‌తో మార్క్ చేయండి.

U	F	P	Y	A	R	G	N	I	T	S	U	S
X	D	J	H	H	H	D	U	S	E	M	H	W
S	J	W	E	Y	S	C	O	A	H	R	Y	M
O	U	E	P	L	E	I	L	L	I	A	O	P
N	C	R	H	S	L	X	F	M	P	L	R	S
I	R	L	L	E	A	Y	P	R	L	H	U	K
U	A	O	P	A	H	Q	F	U	A	P	I	D
G	B	B	P	T	W	C	S	I	O	T	I	N
N	D	S	P	U	V	K	O	T	S	U	S	M
E	A	T	N	R	S	Y	C	T	Q	H	W	Z
P	E	E	E	T	N	O	H	S	T	D	K	E
O	Y	R	L	L	L	A	M	P	R	E	Y	A
E	P	S	P	E	E	G	N	O	P	S	R	L

CRAB	OTTER	SPONGE
DOLPHIN	PENGUIN	SQUID
JELLYFISH	SEA TURTLE	STARFISH
LAMPREY	SEAL	STINGRAY
LOBSTER	SHARK	WALRUS
MOLLUSKS	SHRIMP	WHALE
OCTOPUS		

బొమ్మలు పూరించండి

పిల్లలూ! మీకు బొమ్మలు గీయడమంటే ఎంతో ఇష్టం కదూ. మీ కోసం ఆర్టిస్ట్ అంకుల్ ముందుగా బొమ్మల్ని సగం గీసి ఉంచాడు. మీరు మిగిలిన భాగాన్ని జాగ్రత్తగా పూర్తి చేయండే!





జత చేయండి

పిల్లలూ! ఇక్కడ కొన్ని జంతువులు వాటి నివాసాలని ఉంచాం. అయితే ఏ జంతువు ఎక్కడుంటుందో గుర్తించి జతచేయండి.

కాగితంతో బెలూన్



పిల్లలూ! మీకు రంగు రంగుల బెలూన్‌లంటే ఇష్టం కదూ. మరి పేపర్‌తోనూ బెలూన్ బొమ్మను తయారుచేసి కిటికీకో, రూఫ్‌కో వేలాడదీస్తే భలే ఉంటుంది కదూ. మనింట్లో దొరికే వస్తువులతోనే దీన్ని ఎలా తయారు చేయాలో మేం నేర్పిస్తాం. జాగ్రత్తగా నేర్చుకోండే.

కావాల్సిన వస్తువులు

కన్‌స్ట్రక్షన్ పేపర్ (ఐదు రంగులు), పేపర్ రోల్, కత్తెర, గమ్, టేప్, దారం

తయారుచేసే విధానం

మీకు నచ్చిన ఐదు రంగుల కన్‌స్ట్రక్షన్ పేపర్‌ని తీసుకుని వాటిపై బెలూన్ ఆకారాన్ని, చిన్న చిన్న వృత్తాలనీ గీసి జాగ్రత్తగా కత్తిరించాలి. తర్వాత ఒక్కో బెలూన్నీ బొమ్మలో చూపిన విధంగా మధ్యకు మడిచి పక్కన ఉంచండి. ఇప్పుడు పేపర్ రోల్ తీసుకుని చిన్న ముక్కని కత్తిరించాలి. రెండు దారాల్ని సమాన భాగాలుగా కత్తిరించి రోల్ రెండు చివర్లలో అతికించండి. తర్వాత వృత్తాలను కూడా రోల్ చుట్టూ అతికించండి. ఇప్పుడు మధ్యకి మడిచి ఉంచిన బెలూన్ ఆకారాల్ని తీసుకుని ఒకదానికొకటి అంటించండి. పేపర్ రోల్‌కి అంటించిన దారాలని వాటి మధ్య నుండి పైకి లాగి రెండిటినీ కలిపి ముడి వేయండి. ఇప్పుడు ఈ ఎయిర్ బెలూన్‌ని మీ వరండాలో వేలాడదీస్తే గాలికి కదులుతూ అందంగా కనిపిస్తుంది.



కనిపెట్టండి

అగ్గిపుల్లలతో చేసిన ఈ బాణం ఒక దిశలో వెళుతోంది. వాటిలో నాలుగు అగ్గిపుల్లల్ని కదిలిస్తే ఒకే దిశలో ఉండే రెండు బాణాలు ఏర్పడతాయి. అదెలాగో కనిపెట్టండి.



రంగులు అద్దండి

పిల్లలు మీకు పక్షులు అంటే చాలా ఇష్టం కదూ. అయితే ఈ గుడ్లగూబకు రంగులు వేయండి.

పదవికాసం - 23

కూర్పు: టి.డి. ప్రసాద్

ఆధారాలు

అడ్డం

1. పెళ్లికొడుకు (3)
3. కంటికి -- పంటికి పన్ను (2)
4. కార్యనిర్వహణ సభ, సంఘం (3)
6. యుద్ధం (2)
7. కిలకిల ప్రథమార్థం (2)
8. రజనీకాంత్ సినిమా (2)
9. కోయడాలు (3)
10. పగటికి, రాత్రికి మధ్య యంత్రం (3)
11. ఎటు చూసినా గవాక్షమే (3)
12. ఊరే నీరు (2)
14. మరలా (2)
15. ఒక్కో మనిషికి (4)
17. కవలల్లో చేపలు పట్టేది (2)
18. గుమ్మాలు, కిటికీలకు ఉండేవి (4)
19. సుడిగాడు మలి సగంలో లేడు (2)
20. క్షణం ఉండని విలక్షణం (2)
21. రోగులకు సేవలందించే సిస్టర్ (2)
22. 'లా' కలిపితే మజ్నూ జోడి, ఇంగ్లీషు అబద్ధం (1)
23. కెరటం (2)
24. చెయ్యెత్తి ఇది కొట్టు తెలుగోడా! (1)
25. 'తే' చేరిస్తే కుట్టేది, 'గో' చేరిస్తే కొట్టేది. అడ్డం 24 తో కలిపి చెరసాల (1)
26. స్పృహలేని స్థితి (2)
27. సంతకం రానీ వేలిముద్ర బాపతు (3)
29. ఇంగ్లీషు నెమ్మది (1)
30. రేపు అటు నుంచి రండి (2)
32. మాంసాహారం కానిది (4)
33. ఆరు కాదు అరవై (2)
34. ఆకాశంలో తక్కువ ఎత్తులో ఎగిరే యంత్రాలు (2)

1	2		✿	3		✿	4		5
6		✿	7		✿	8		✿	
	✿	9			✿	10			✿
✿	11			✿	12		✿	✿	13
14		✿	15	16			✿	17	
	✿	18				✿	19		✿
✿	20		✿		✿	21		✿	22
23		✿	24	✿	25	✿	26		✿
27		28	✿	29	✿	30		✿	31
32				✿	33		✿	34	

నిలువు

1. ఏడాదిగా కృష్ణానదికి ఇది రాలేదు (3)
2. ఇది తీసుకుంటే వడ్డీ పడుతుంది (2)
3. నిద్రలో వచ్చేవి (3)
4. ఔషధ రసం (3)
5. చాయ్ చాయ్ (2)
7. అల్లరి నరేష్, గీతాసింగ్, ఇ.వి.వి.సత్యనారాయణ కాంబినేషన్లో 2006లో వచ్చిన సినిమా (5)
8. బాటసారి దారితప్పాడు (4)
9. వంద లక్షలు (2)
11. ఆకు, వక్క, సున్నం కలిపి (2)
12. తప్పు చేస్తే జైలులో వీటిని లెక్కించాల్సిందే (3)
13. అమ్మ పాడేది (2)
14. పుట్టిన బిడ్డ ఆడ కాదు -- (2)
16. వలపు వరుస మారింది (3)
17. వేగం, శౌర్యం (2)
18. మెడపై ఉండేది (2)
19. రేసుకోర్సు దారితప్పింది (4)
20. శాఖలన్నీ కకావికలమే 7,3,1,6 (4)
23. అవినీతి నిరోధక శాఖ క్లుప్తంగా (3)
28. పైకెళ్తే 'కీడు' (2)
30. బలం, సమృద్ధి (2)
31. జులై కంటే ముందు పుట్టింది (2)

	3	8	9	7	4			6
	1		2		6	7		
	7	9	8					
	2		6	4	5		9	1
		1				4		
5	6		1	9	8		2	
					7	5	1	
		2	4		9		7	
1			5	6	2	9	4	

గతవారం జవాబులు

సుడోకు

8	4	5	9	7	2	3	6	1
7	1	9	6	3	5	4	8	2
2	3	6	1	8	4	7	5	9
9	6	7	5	2	3	1	4	8
3	2	4	7	1	8	5	9	6
5	8	1	4	9	6	2	7	3
1	5	8	3	6	7	9	2	4
4	9	2	8	5	1	6	3	7
6	7	3	2	4	9	8	1	5

1 య	2 ము	న	✿	3 ఆ	లు	✿	4 జ	ప్పా	✿
5 క్ష	ర	✿	6 పా	ట	✿	7 లా	డ్జి	✿	8 తా
గా	✿	9 చూ	డి	✿	10 బా	గు	✿	11 మా	త
12 నం	13 బ	రు	✿	14 తా	ట	✿	15 దు	ర్గం	✿
✿	ర్జీ	✿	16 న	టి	✿	17 న	ష్ట	✿	18 టు
19 కౌ	✿	20 మే	క	✿	21 ము	క్క	✿	22 మీ	✿
✿	23 జూ	✿	24 ము	రా	రి	✿	25 శం	దే	26 సం
27 జ	✿	28 భం	శు	✿	29 పా	తి	క	✿	త
30 న	31 గ	రం	✿	32 కా	లు	✿	33 లా	34 ఇ	కా
35 నీ	తి	ఆ	యో	గ్	✿	36 ఫీ	✿	37 స్త్రీ	లు

మోడువారిన చెట్ల మధ్య ఆకాశంలో నిప్పురవ్వలు విరజిమ్మినట్టు కనిపిస్తున్న ఈ దృశ్యాన్ని చూస్తే ఓ అద్భుత చిత్రకారుడి కుంచె నుంచి జాలువారిన పెయింటింగ్ అనే సందేహం రాకమానదు. కళ్లను కట్టిపడేస్తున్న ఇలాంటి అందాలన్నీ నమీబియాలోని డెడ్‌వెలి ఎడారి ప్రాంతానివి.



- Jains are the pioneer of Micro Irrigation Systems in India
- Jains are the World's only integrated manufacturer of complete range of Drip and Sprinkler Irrigation Systems with 29 Factories around the World
- Jains Custom built Systems are available for all crops & for all or any firm sizes
- Jains have Covered more than 55 Lakhs Acre under Micro Irrigation
- Jains have In-house R&D cum Demonstration Farm of more than 2000 Acres
- Jains have ISO-9001 accreditation by RWTUV Germany
- Jains have about 2 millions satisfied farmers and Number of Corporate & Industrial customers in over 50 countries around the world.
- Jains undertake Turnkey Projects from Concept to Commissioning which includes Training and Consultancy

జైన్®
జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్

1-1-782/బి/5, పార్క్ ఎదురుగా,కెనరాబ్యాంక్ దగ్గర, గాంధీనగర్, హైదరాబాద్
హైదరాబాద్ ఫోన్ నంబర్లు : 040-2761-4474,2761-1706,
ఆంధ్రా ఫోన్ నంబర్లు : 9440797807, 9440797881, 9440797840
తెలంగాణ ఫోన్ నంబర్లు : 9440797846, 9440797816, 9440797888

అల్లికల వీధుల్లో....

నిరసననో, ప్రత్యేకతనో, సందేశాన్నో, శుభాకాంక్షలనో పబ్లిక్‌గా చెప్పడానికి గ్రాఫిటీకి మించింది లేదనేది అభిప్రాయమైతే ఓసారి ఈ చిత్రాల్ని చూడండి. వీధుల్లో పడిన యార్న్ బాంబ్‌లివి. క్రోచె పనితనాన్ని సరికొత్త భావ ప్రకటనా విప్లవానికి అల్లిన ఈ క్రోషె గెరిల్లాలు యార్న్ స్టార్మింగ్‌తో మహా నగర వీధుల్ని రంగుల దారాలతో కలిపేస్తున్నారు. లండన్‌కు చెందిన లారెన్ ఒ ఫారెల్ 'డెడ్లీ నిట్‌షేడ్' గ్రాఫిటీ పేరుతో ఈ సరికొత్త వీధి కళను 'నిట్ ద సిటీ' ఉద్యమంతో పాపులర్ చేసింది. హ్యూస్టన్‌కు చెందిన మాగ్దా సాయెగ్ ఈ కళలో ప్రవీణురాలు. జఫ్ఫా గర్ల్, క్రోషె ట్రీ ప్రాజెక్ట్‌లు వంటివి ఈ కళను ప్రపంచవ్యాప్తం చేశాయి. క్రోషె ట్రీ ప్రాజెక్ట్ భారత్‌లోని రంగుల అల్లికల్ని చెట్లకు తొడిగింది. కొన్ని దేశాల గ్రాఫిటీ విషయంలో ఉన్నట్టే 'యార్న్ బాంబింగ్'పై నిషేధం ఉంది. కొన్ని చోట్ల మాత్రం ప్రజలంతా ముందుకొచ్చి సూది దారాలు కలుపుతున్నారు.

Check List

Book Number	KSR02B128	Date	03/09/22
Front Cover	Yes	Back Cover	Yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Mounika	Cutting By	Mouni
Scanned By	Shameera	Pages	29